Postail Licence No. L/KNL/3-19(D). 2016 - 2018

# ఉత్తేజిత దినపత్రిక

ఎడిటర్ : చంద్ర శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :03 | సంచిక : 353 | పేజీలు 8 | వెల : 5 | గురువారం 05 జూన్ 2025

ఉత్తేజిత దినపత్రిక
ఎడిటర్ : చంద్ర శేఖర్ యం
అక్షరాన్నే ఆయుధంగా మలుచుకున్న పత్రిక

16th ANNIVERSARY
వార్షికోత్సవ ప్రత్యేక సంచిక

ప్రకటనదారులకు, పాఠకులకు మా నమస్సుమాంజలులు...

16వ వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనలు మంజూరు చేయుట గురించి పాఠకులారా!.. ఉత్తేజిత దినపత్రికను హృదయపూర్వకంగా అభిమానించినందుకు మేనేజ్‌మెంట్ మీకు అభినందనలు తెలియజేస్తుంది.

జన వాక్కులే వార్తలుగా మలుచుకొని నిజాన్ని ఇజంగా చేసుకొని నిరంతరం నూతన వరవడిలో పత్రికను మీ ముందుకు తెస్తున్నామన్నా విషయం మీకందరికీ తెలిసిందే.

పత్రిక నడవాలంటే ఆర్థిక మూలాలు ముఖ్యం. కావున మీరంతా వార్షికోత్సవ సందర్భంగా ప్రకటనులు మంజూరు చేసి పత్రికాభివృద్ధికి మీ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేయవలసిందిగా ఆకాంక్షిస్తున్నాము ....

మీ... ఉత్తేజిత దినపత్రిక ఎడిటర్

తారీఫ్

| | |
|---|---|
| బ్యాక్ కవర్ పేజీ మల్టీకలర్ : 50,000/- | బ్లాక్ & వైట్ పేజీ |
| ఇన్నర్ మల్టీకలర్ పేజీ : 20,000/- | బ్యాక్ పేజీ : 20,000/- |
| ఫ్రంట్ మల్టీకలర్ పేజీ : 70,000/- | ఇన్నర్ పేజీ : 20,000/- |
| | ఫ్రంట్ పేజీ : 30,000/- |

ప్రకటనదారులకు విజ్ఞప్తి...

గమనిక : సకాలంలో ప్రకటనల తాలుకా ఫోటోలు మరియు మెటీరియల్‌ను ఉత్తేజిత తెలుగు దినపత్రిక విలేకరులకు అందజేయవలసిందిగా కోరడమైనది.



## నేరస్థుల్ని అడ్డం పెట్టుకొని

# రాజకీయాలు

**నేరం చేసి మళ్ళీ ప్రభుత్వంపైనే నిందలు**

**జగన్‌లా కక్షసాధింపు రాజకీయాలు సరికాదు**

**జగన్ తప్పలు రుజువైతే చట్టప్రకరం చర్యలు**

**కేబినేట్ భేటీలో మంత్రులతో సిఎం చంద్రబాబు**

అమరావతి: ఒకప్పుడు నేరస్థుల్ని రాజకీయ నాయకులు కలవాలంటేనే భయపడేవారన్న చంద్రబాబు.. ఇప్పుడు నేరస్థుల్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. నేరస్థులకు తాము అండగా ఉన్నామని ప్రజలకు సందేశమిస్తూ రాజకీయాల్ని ఎటు తీసుకుపోతున్నారో అర్థం కావట్లేదని దుయ్యబట్టారు. తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. ఈ మేరకు కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తనను జైల్లో పెట్టారని.. జగన్‌ను కూడా జైలులో పెడతామంటే ఎలా కుదురుతుంది.. అది కరెక్ట్ కాదు కదా' అని మంత్రులతో సీఎం అన్నారు. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా.. 'జగన్ తప్పు చేశాడు కదా? మనం ఎందుకు చర్యలు తీసుకోకూడదని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రశ్నించగా.. 'అతను తప్పులు చేసినట్లు రుజువులు ఉంటే చట్టానికి దొరికితే మనం చర్యలు తీసుకోవాలి. మంత్రులు చాలా జాగ్రత్తగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇది వరకు నేరస్థులు ప్రభుత్వానికి బయపడి వెళ్ళిపోయేవారని.. ఇప్పుడు మనం నేరస్థులతో రాజకీయాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నేరం చేసి మళ్ళీ ప్రభుత్వంపైనే నిందలు వేసే పరిస్థితి నేడు నెలకొందని తెలిపారు. గంజాయ్ బ్యాచ్ నేరాలు చేసిందని.. తప్పులు చేసి.. తిరిగి ప్రభుత్వంపైనే నెడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సీఎంకు మంత్రులు అభినందలు తెలిపారు. కూటమిలోని పక్షాల మధ్య సమన్వయం బాగా ఉందని సీఎం అన్నారు. పీ4కు సంబంధించి ప్రతి జిల్లాలో ఒక కార్యాలయం ఏర్పాటు- చేయాలన్నారు. నియోజకవర్గం వరకు వెళ్ళాలని మంత్రులకు సూచించారు. విజయ మాల్య లాంటి వాళ్ళు డబ్బులు తిని వెళ్ళిపోయారని.. రాజకీయ ముసుగులో ఉండి జగన్ నేరాలు చేస్తున్నారని విమర్శించారు. నేరస్థులను కూడా ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. జగన్, మిథున్ రెడ్డి ఇద్దరిలో ఎవరు ముందు జైలుకు వెళ్తారనే అంశంపై వైసీపీలో చర్చ జరుగుతోందని అన్నారు. తప్పులు చేసిన వారు ఎవరు కూడా తప్పించుకోకూడదని స్పష్టం చేశారు. చట్టం, న్యాయ ప్రకారం వెళ్ళాలని సీఎం తెలిపారు. నేరస్థుడు నేరం చేసి బయటకు వెళ్లిన తరువాత అతను ఏం చేస్తున్నాడనేది తెలుసుకోవాలన్నారు. ఆ సిస్టం వెంటనే అమలు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని మంత్రులతో సీఎం చంద్రబాబు అన్నారు.

గత వైకాపా ప్రభుత్వంలో తప్పులు చేసిన పెద్దలు ఇంకా బయటే తిరగటం సబబు కాదని పలువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. ఏ తప్పు చేయకుండానే తెలుగుదేశం నాయకుల్ని గత ప్రభుత్వంలో జైలుకు పంపారని మంత్రి సంధ్యారాణి గుర్తు చేశారు. మనల్ని అన్యాయంగా వేధించారని మనమూ వేధించటం సరికాదన్న చంద్రబాబు.. గత ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై పారదర్శకంగా విచారణ జరుపుతామన్నారు. నేరం రుజువైతే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. రాజకీయ కక్ష సాధింపులు మన ధోరణి కాదని.. ఈ తేడాను ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు.



2లో..

## 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కల సేకరణ

**అప్పడే కులగణన కూడా జరిగే అవకాశం**

**కేంద్ర అధికార వర్గాల వెల్లడి**




2లో..

## ట్రావెల్స్ బ్యాగులో మహిళ మృతదేహం

**హత్యచేసి పడేసినట్లు పోలీసుల గుర్తింపు**

## పవన్ కళ్యాణ్‌కు యువగళం పాదయాత్ర పుస్తకం

**నాటి రాక్షస పాలన కళ్లకు కట్టిందన్న డిప్యూటి సిఎం**

రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పిన యువగళం పాదయాత్రపై పుస్తకాన్ని (రూపొందించారు. జగన్ రాక్షస పాలనపై సమర శంఖంలా యువగళం అంటూ యువగళం పుస్తకంపై పవన్ ప్రశంసలు కురిపించారు. అలాగే ఇతర మంత్రులకు కూడా మంత్రి లోకేష్ యువగళం పుస్తకాన్ని అందజేశారు.




2లో..

## రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు

**కేసీఆర్ ఏం తప్ప చేశారని నోటీసులు ఇచ్చారు**

**ఇందిరాపార్క్ వద్ద ధర్నాలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



2లో..



2లో..

## విజయోత్సాహంలో ఘోర విషాదం

**ఆర్‌సిబి విజయోత్సవ సభలో అపశృతి**

**చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట**

**ఘటనలో పదిమంది మృతి....50మందికి గాయాలు**

**భారీగా తరలివచ్చిన అభిమానులతో స్టేడియం వద్ద తోపులాట**

**కంట్రోల్ చేయలేక చేతులెత్తేసిన బెంగళూరు పోలీసులు**

**బెంగుళూరు చేరుకున్న ఆర్‌సిబి జట్టుకు డిప్యూటి సిఎం స్వాగతం**




## ఏడాది పాలనలో అంతా బాగానే పనిచేశారు

**ప్రజా సమస్యలపరిష్కారమే ఎజెండగా ముందుకు సాగాలి**

**పోలవరం -బనకచర్లపై కేంద్రం నుంచి సానుకూల స్పందన**

**ప్రాజెక్టులకు నిధుల సమీకరణకు కేంద్రం సానుకూలం**

**15న తిరుపతిలో సినిమా సెలబ్రిటీలతో యోగా**

**సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకే ఆమోదం.**

**248మంది కానిస్టేబళ్ల ప్రమోషన్లకు ఓకే**

**పోలీసు అకాడమీకి అదనంగా 94.45 ఎకరాలు**

**వైఎస్సార్ కడప జిల్లాగా మార్పునకు ఆమోదం**

**కేబినేట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి**

2లో..

క్వాంటం వ్యాలీ బిల్డింగ్ డిజైన్స్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పంపించాలని అధికారులకు సీఎం ఆదేశించారు. కేబినెట్‌లో యువగళం గురించి మంత్రి లోకేష్ ప్రస్తావిస్తూ.. యువగళం ప్రభుత్వానికి బ్రేక్ త్రూ అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రావడానికి, అధికారాన్ని అనుభవించడానికి యువగళం పాత్ర కూడా ఉందని సీఎం అన్నారు. గత ఏడాది ఇదే రోజు మనం ఊహించని విజయం లభించిందన్నారు. ప్రజలు ఆశయాలకు, అంచనాలకు అనుగుణంగా పని చేయాలని ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# విజయోత్సాహంలో ఘోర విషాదం



బెంగళూరు: బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం దగ్గర అపశ్రుతి చోటు చేసుకుంది. ఆర్‌సిబి విజయోత్సాహంలో విషాదం చోటుచేసుకుంది. క్రికెటర్ల విజయోత్సవాతన్ని కళ్లారాచూడాలని తరలివచ్చిన అభిమానుల తోపులాట తొక్కిసలాటకు దారితీసింది. ఈ క్రమంలో పదిమంది మృత్యువాతపడ్డారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత కప్పు సాధించిన ఆనందంలో అభిమానులు భారీగా చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకున్నారు. దీంతో అక్కడ భారీగా తొక్కిసలాట జరిగింది. చిన్నస్వామి స్టేడియం లోపలికి అభిమానులు తోసుకెళ్లేందుకు ప్రయత్నించారు. బారికేడ్లు దూకి స్టేడియంలోకి వెళ్లేందుకు అభిమానులు ప్రయత్నించారు. భారీ సంఖ్యలో వచ్చిన అభిమానులను పోలీసులు నియంత్రించలేకపోయారు. దీంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పది మంది మృతి చెందారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. దాదాపు 50 మంది గాయాలపాలయ్యారు. వారిని వివిధ అస్పత్రులకు తరలించారు. అభిమానులను నియంత్రించేందు కు చిన్నస్వామి స్టేడియం దగ్గర పోలీసులు లాఠీఛార్జ్ ప్రారంభించారు. స్టేడియం ఖాళీ చేయాలని అభిమానులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్ లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్–2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 50 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవెరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటు–న్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.

# ఏడాది పాలనలో అంతా బాగానే పనిచేశారు




అమరావతి: ఏడాది పరిపాలన అంతా బాగుందని, మంత్రులు మరింత సమర్థంగా పనిచేయాలని సిఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా కావాలని పిలుపునిచ్చారు. మరింత దూకుడు పెంచి ప్రజల్లో మమేకం కావాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు.

పోలవరం –బనకచర్లపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తోందని, ప్రాజెక్టుకు నిధుల సమీకరణ జరుగుతోందని సీఎం తెలిపారు. ఈ ఏడాది మంత్రులు బాగా పనిచేశారని.. ఇంకా కష్టపడాలని.. ఈ ఏడాది ఏం చేశారనేది ఒకసారి సమీక్ష చేసుకోవాలని సూచించారు. రాబోయే ఏడాదికి ప్లాన్ చేసుకోవాలన్నారు.

ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.. ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన కేబినెట్ సమావేశంలో.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు మంత్రులందరం అభినందనలు తెలిపామని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.. కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత.. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు పార్థసారథి వివరించారు.. సంక్షేమ కార్యక్రమాలు బాగా చేశామని, కానీ ఏం చేసినా జనాన్ని ఎంపవర్ చేయాలని మంత్రులకు సిఎం తెలిపారు. పోలవరం, బనకచర్ల ప్రాజెక్ట్‌లకు కేంద్రం సాయం చేస్తుందన్నారు. కేంద్రం సానుకూలంగా స్పందిస్తోందని.. ఆలస్యం అయితే ప్రతీ ఏడాది వ్యయం పెరుగుతుందని అన్నారు. నిధుల సమీకరణ కూడా జరుగు తోందన్నారు. పోలవరం, బనకచర్లకు కేంద్రం, రాష్ట్రం, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, హైబ్రిడ్ అన్యూటీ మోడల్లో కూడా నిధులు వస్తాయని అన్నారు. నదుల అనుసంధానంపై కేంద్రం సానుకూలంగా ఉందంటూ సీఎం సంతోషం వ్యక్తం చేశారు. పోలవరం, బనకచర్లను చేపట్టి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్నారు. క్వాంటం వ్యాలీని చేయాలని.. 2026 జనవరికి కార్యరూపం తీసుకురావాలని వెల్లడించారు. క్వాంటం వ్యాలీ బిల్డింగ్ డిజైన్స్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పంపించాలని అధికారులకు సీఎం ఆదేశించారు. కేబినెట్‌లో యువగళం గురించి మంత్రి లోకేష్ ప్రస్తావిస్తూ.. యువగళం ప్రభుత్వానికి బ్రేక్ త్రూ అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి రావడానికి, అధికారాన్ని అనుభవించడానికి యువగళం పాత్ర కూడా ఉందని సీఎం అన్నారు. గత ఏడాది ఇదే రోజు మనం ఊహించని విజయం లభించిందన్నారు. ప్రజలు ఆశయాలకు, అంచనాలకు అనుగుణంగా పని చేయాలని ఈ సందర్భంగా మంత్రులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఈ నెల 15న తిరుపతిలో సినిమా సెలబ్రిటీలతో యోగా నిర్వహించాలని తెలిపారు. టూరిజం మంత్రి వెళ్లి సెలబ్రెటీలను ఆహ్వానించాలని.. తాను కూడా కొంత మందికి ఫోన్లు చేసి చెబుతానని సీఎం అన్నారు. 1983లో మహానాడుకు షర్ట్‌లు పసుపునీళ్లలో ముంచుకుని అటెండ్ అయ్యారని.. అప్పటి నుంచి మహానాడు నిర్వహిస్తున్నారన్నారు. వాతావరణం బాగా సహకరించిందని.. ఇది వరకు సమ్మర్‌లో అల్లాడి పోయామన్నారు. కానీ ఇప్పుడు వాతావరణం మంచిగా సహకరించిందని అన్నారు. ఈ సారి మహానాడు బాగా జరిగింది... కార్యకర్తలు కూడా బాగా వచ్చారని కేబినెట్ సమావేశంలో తెలిపారు. ఇకపోతే సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం ఇచ్చింది. వివిధ సంస్థలకు చేసిన భూ కేటాయింపులు, రాయతీల కల్పనకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రక్షితనీటి సరఫరాకు శ్రీకాకుళంలో రూ.5.75 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండ్‌కు ఆమోదం ఇచ్చింది. కుప్పంలో రూ.8.22 కోట్లు– వయబిలిటి గ్యాప్‌ఫండ్ విడుదలకు ఆమోదం అభించింది. సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకే కేబినెట్ ఆమోదం. 1 ఫిబ్రవరి 2025 నాటికి అర్హులైన 17 మంది యావజ్జీవ ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. 248 మంది కానిస్టేబుళ్లకు పదోన్నతి కల్పించే ప్రతిపాదనకు ఆమోదం ఇచ్చారు. వైఎస్సార్ జిల్లా పేరును వైఎస్సార్ కడప జిల్లాగా మారుస్తూ తెచ్చిన జీవోకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పోలీసు అకాడమీకి అదనంగా 94.45 ఎకరాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం ఇచ్చింది. మహిళలు రాత్రిపూట కూడా పనిచేసే చట్టసవరణకు ఆమోదం. రాత్రిపూట పనిచేసే మహిళలకు భద్రత, రవాణా సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. పలు సంస్థలకు భూకేటాయింపులు, హోమ్ శాఖ కు భూ కేటాయింపులు రాయితీల కల్పన పై మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. పరిశ్రమలకు సంబంధించి 2025 చట్టంలో పలు నింబధనల సవరణలకు ఆమోదం లభించింది.. ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబిలిష్

మెంట్ బిల్లు 2025 చట్టంలో నింబధనల సవరణలకు ఆమోదముద్ర పడిందన్నారు.. విశాఖపట్నంలో యాత్రి నివాస్ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ఇచ్చిన నిధులకు సంబంధించి ర్యాటి ఫై చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.. క్వామ్ టమ్ వ్యాలీకి సంబంధించి స్కూళ్ళు దగ్గర నుంచి యూనివర్సిటీల వరకు ఇన్వాల్వ్ అయ్యేలా చూడడంతో పాటు– 50 ఎకరాల కేటాయిస్తు నిర్మయం

తీసుకున్నామని పార్థసారథి వెల్లడించారు. యోగాంధ్ర కార్యక్రమం కోసం మాస్ ర్యాలీలు చేయాలి.. అందరూ పాల్గొనేలా చర్యలకు సంబంధించి కేబినెట్‌లో చర్చించామని అన్నారు. తెలుగు సినిమా సెలెబ్రిటీలు కూడా యోగలో పాల్గొనేందుకు పర్యాటక శాఖా మంత్రి చర్యలు తీసుకుంటారని మంత్రి పార్థసారథి తెలిపారు.. మరోవైపు, ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశానికి ముగ్గురుమంత్రులు హాజరు కాలేక పోయారు. దేవాదాయశాఖా మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి.. రవాణా శాఖా మంత్రి రాం ప్రసాద్ రెడ్డి.. పెట్టు–బడులు మౌలిక సదుపాయాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశానికి హాజరుకాలేదు.. దీనిపై ముందుగానే సీఎం చంద్రబాబుకు సమాచారం ఇచ్చినట్టుగా తెలుస్తోంది..

# రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు



**హైదరాబాద్**: రాజకీయ దురుద్దేశంతో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనని..మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో తెలంగాణ జాగృతి హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించింది. ధర్నాలో కవిత పాల్గొని మాట్లాడారు. తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వడం కేసీఆర్ చేసిన తప్పా ? తెలంగాణను అభివృద్ధిలో నెంబర్ వన్‌గా నిలబెట్టడం తప్పా? అంటూ మండిపడ్డారు. కాళేశ్వరం కమిషన్ కాదు.. అది కాంగ్రెస్ కమిషన్, రాజకీయ కమిషన్ కాళేశ్వరం అంటూ విమర్శించారు. ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని.. ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌస్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చునని.. కాళేశ్వరంలో వాడిన స్టీల్‌తో వంద ఈఫిల్ టవర్లు కట్టవచ్చన్నారు. కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బూర్జ ఖలీఫాలు కట్టవచ్చునని తెలిపారు. అంత భారీ ప్రాజెక్టు కాళేశ్వరమని.. ప్రాజెక్టు పూర్తయితే 35 శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందన్నారు. 40 టీ–ఎంసీలతో హైదరాబాద్‌కు శాశ్వతంగా నీళ్లు ఇచ్చే ప్రాజెక్టు కాళేశ్వరమని.. మన పరిశ్రమలకు 16 టీ–ఎంసీల నీళ్లు అందించే ప్రాజెక్టు కాళేశ్వరమని.. 90 మీటర్ల అడుగున ఉండే నీళ్లను 600 మీటర్లపైకి.. ఎత్తిపోసే ప్రాజెక్టు కేసీఆర్‌దేనన్నారు. గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టును నిర్మించారని.. కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంతపెద్ద ప్రాజెక్టును కట్టాలన్న ఆలోచన రాదన్నారు. తెలంగాణ సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరమని.. దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్టుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. కేసీఆర్‌ని బద్నాం చేయడానికి మాత్రమే కాళేశ్వరం కమిషన్ వేసిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90 శాతం పనులను మెఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని.. మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మతులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్ హౌస్ పనులు చేసిన మెఘా కృష్ణారెడ్డిని కమిషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని మండిపడ్డారు. 90 శాతం పంప్‌హౌస్‌ల పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఎందుకు వదిలేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరుషాన్ని చూపించాల్సిన సమయం వచ్చిందని.. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు వ్యతిరేకించడం లేదంటూ నిలదీశారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్ రెడ్డి ఎందుకు కేంద్రానికి ఫిర్యాదు చేయడం లేదని.. గోదావరి – పెన్నా అనుసంధానం పేరిట నీళ్లు తరలింపును తక్షణమే అడ్డుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. చంద్రబాబు ఎన్డీఏలో ఉన్నందున జల దోపిడి చేసినా రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రశ్నించడం లేదన్నారు. ఎనిమిది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఏమీ తేవడం లేదన్నారు. బీజేపీలో ఉన్న ఒకే ఒక తెలంగాణ బిడ్డ ఈటల రాజేందర్ కూడా మాట్లడకపోవడం శోచనీయమన్నారు. బకనచర్ల ప్రాజెక్టును ఆపే ప్రయత్నం చేసే బాధ్యతను ఈటల రాజేందర్ తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకొచ్చే బాధ్యతను కూడా ఈటల రాజేందర్ తీసుకోవాలన్నారు. గోదావరి నీటిలో వెయ్యి టీ–ఎంసీల హక్కును సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. మంచిర్యాల, రామగుండం ప్రాంతంలో ధర్నాకు వస్తున్న జాగృతి కార్యకర్తలను అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎందుకు ఇంత భయపడుతున్నది? ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమన్నారు. హైదరాబాద్‌లో ధర్నా చేయనివ్వకపోతే జిల్లాల్లో, గల్లీల్లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ప్రాంగణం మంగళవారం ఉదయం ఉద్రిక్త వాతావరణాన్ని చూసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జారీ చేసిన నోటీ–సులకు వ్యతిరేకంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ ధర్నాకు భారీ సంఖ్యలో జాగృతి కార్యకర్తలు తరలివచ్చారు. కవిత తన వ్యాఖ్యలతో ఈ వ్యవహారాన్ని పూర్తిగా రాజకీయ కుట్రగా అభివర్ణించారు. కేసీఆర్ తన గట్టి గుండెతోనే కాళేశ్వరం లాంటి మహత్తర ప్రాజెక్టును నిర్మించారని చెప్పారు. 'ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 40 లక్షల ఎకరాలకు

నీళ్లు అందించబడ్డాయి. ఇలాంటి ప్రాజెక్టుపై ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. కాళేశ్వరం కమిషన్ కాదు, ఇది కాంగ్రెస్ కమిషన్. ప్రాజెక్టును బద్నాం చేయడమే వారికి గోల్,' అని విమర్శించారు.

# 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కల సేకరణ



న్యూఢిల్లీ: దేశవ్యాప్త జనగణన ఎప్పుడు నిర్వహిస్తారోనన్న ఎదురుచూపులకు తెరపడనుంది. జనగణనపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు కేంద్రం సన్నద్ధమవుతోంది. 2027 మార్చి 1 నుంచి జనాభా లెక్కింపు జరగనుందని కేంద్ర అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో పాటు కులగణన కూడా నిర్వహించ నున్నట్లు తెలిపాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తరఖండ్, లద్దాఖ్‌లతో పాటు– కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాత్రం 2026 అక్టోబర్ ప్రారంభంలోనే లెక్కింపు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ జనాభా గణన రెండు దశల్లో నిర్వహించనున్నారు. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని 'రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా' పర్యవేక్షణలో జనాభా లెక్కలు నిర్వహిస్తారు.

సాధారణంగా పదేళ్లకోసారి జనాభా లెక్కలు నిర్వహిస్తారు. చివరి సారి 2011లో దీన్ని నిర్వహించారు. 2021 జనాభా లెక్కలకు సంబంధించి 2020లోనే ఈ పక్రియ చేపట్టాల్సింది. కానీ.. కొవిడ్ కారణంగా వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తారనేదాని పైనా స్పష్టత లేకుండా పోయింది. సరైన సమయంలో నిర్వహిస్తామని 2024లో ఓ సందర్భంలో కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారు. 16 ఏళ్ల తర్వాత తొలిసారి జనాభా గణన నిర్వహించనున్నారు. ఇప్పటికే జనాభా లెక్కల వివరాల నమోదుకు సంబంధించి 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసినట్లు– తెలుస్తోంది.

# ట్రావెల్స్ బ్యాగులో మహిళ మృతదేహం

మేడ్చల్:మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లి పియస్ పరిధిలో దారుణం చోటు– చేసుకుంది. విజయదుర్గ ఓనర్స్ అసోసియేషన్ కాలనీ నిర్మానుష్య ప్రాంతంలో బ్యాగులో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది.. బ్యాగ్ నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతురాలు వయసు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. మెరూన్ కలర్ పంజాబీ డ్రెస్ తో ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలానగర్ జోన్ డీసీపీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీంలు రంగంలోకి దిగాయి. మృతురాలి ఆచూకీ, హత్య చేసిన వారి వివరాల కోసం దర్యాప్తు చేపడుతున్నారు.

ెలవులు ఇచ్చారు. తిరిగి 2025–26 విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుంది. ఈ సంవత్సరం నుంచే కొత్తగా ఎంబైపీసీ చదివే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

# ఆపరేషన్ సిందూర్ రాత్రి మెలకువతో ప్రధాని

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సందర్భంలో ఆ రోజు రాత్రి ప్రధాని మోడీ నిముషనిముషానికి వివరాలు తెలుసుకుంటూ గడిపారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. అర్ధరాత్రి సమయంలో చేపట్టిన ఈ ఆపరేషన్‌ను ప్రధాని మోదీ ఎలా పర్యవేక్షించారనే విషయాన్ని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తాజాగా వెల్లడించారు. ఇండియన్ ఆర్మీ మే 7వ తేదీ రాత్రి పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ సంస్థలను ధ్వంసం చేసిందని తెలిపారు. ఆ సమయంలో ప్రధాని మోదీ ప్రతి నిమిషం.. ఎక్కడ ఏం జరిగింది. ఎలా జరిగిందనే విషయాలను పర్యవేక్షించారని చెప్పారు. ఈ ఆపరేషన్ సమయంలో ప్రధాని ఎటువంటి ఒత్తిడికి లోను కాలేదని మంత్రి స్పష్టం చేశారు. సాధారణంగానే ప్రధాని మోదీ.. ఎక్కువగా రాత్రి సమయాల్లోనే పని చేస్తుంటారని చెప్పుకొచ్చారు. అలాగే ఈ ఆపరేషన్ సిందూర్‌ను సైతం ఆయన రాత్రి సమయంలో పర్యవేక్షించారని తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలో మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాన మంత్రి కార్యాలయం సహాయ మంత్రి జితేంద్ర సింగ్

మాట్లాడుతూ.. రక్షణ బలగాలకు ప్రధాని మోదీ పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని గుర్తు చేశారు. దీంతో ఆయా బలగాలకు ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై ఒక స్పష్టత ఏర్పడిందన్నారు. అయితే ఈ తరహా నిర్ణయం గతంలో ఎన్నడూ తీసుకోలేదని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గుర్తు చేశారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాదులు, ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంలో.. ప్రధాని మోదీ పక్కా స్పష్టతతో ఉన్నారన్నారు. అంతేకాకుండా.. ఈ దాడుల సమయంలో పౌరులకు ఎటు–వంటి హానీ జరగకూడదన్నది ఆయన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఇక పాకిస్థాన్ అణుబాంబుల పేరుతో భయపెట్టే ప్రయత్నం చేసినా.. ప్రధాని భయపడలేదన్నారు మంత్రి జితేంద్ర సింగ్. ప్రధాని మోదీ వ్యక్తిగతంగా కానీ.. దేశ భద్రత పరంగా కానీ.. ఎలాంటి భయాందోళనకు గురికాలేదన్నారు. పహల్గాం ఉగ్రదాడి

అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఖచ్చితమైన టార్గెట్‌తో.. సంయమనంతో చేసిందని స్పష్టం చేశారు. ఈ దాడులు కేవలం ఉగ్రవాద స్థావరాలు, వాటి మౌలిక సదుపాయాలే లక్ష్యంగా చేసుకుందే కానీ.. పౌరులు, ఆ దేశ సైనికులను టార్గెట్‌గా చేసుకోలేదని గుర్తు చేశారు. భారత దేశ పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో పాకిస్థాన్ డ్రోనులు, క్షిపణులతో దాడి చేసి.. పౌరులతోపాటు– సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుందని వివరించారు. దీంతో భారత్ ప్రతీకార చర్యలకు దిగిందని.. పాకిస్థాన్‌లోని కీలకమైన సైనిక స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేసిందని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు.

# పవన్ కళ్యాణ్‌కు యువగళం పాదయాత్ర పుస్తకం




అమరావతి: యువగళం' పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని డిప్యూటీ– సీఎం పవన్‌కల్యాణ్‌కు మంత్రి నారా లోకేశ్ అందజేశారు. క్యాబినెట్ భేటీకి హాజరయ్యేందుకు సచివాలయానికి వచ్చిన పవన్‌ను లోకేశ్ కలిసి అందించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ నాటి రాక్షస పాలనపై ప్రజలను చైతన్యం చేయడంలో యువగళం పాదయాత్ర సఫలీకృతమైందన్నారు. నాటి అనుభవాలను కళ్లకు కట్టినట్లుగా పుస్తకరూపంలోకి తేవడంపై లోకేశ్‌ను ప్రశంసించారు. అరాచక పాలన అంతమై నేటికి ఏడాది పూర్తయిందని.. గత ప్రభుత్వ పీడకలను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదన్నారు. పాదయాత్ర నాటి అనుభవాలను పవన్‌తో లోకేశ్ పంచుకున్నారు. రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పిన యువగళం పాదయాత్రపై పుస్తకాన్ని (రూపొందించారు. జగన్ రాక్షస పాలనపై సమర శంఖంలా యువగళం అంటూ యువగళం పుస్తకంపై పవన్ ప్రశంసలు కురిపించారు. అలాగే ఇతర మంత్రులకు కూడా మంత్రి లోకేష్ యువగళం పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. నాటి రాక్షస పాలనపై ప్రజలను చైతన్యవంతం చేయడంలో యువగళం పాదయాత్ర సఫలీకృతం అయ్యిందన్నారు. ఆనాటి అనుభవాలను కళ్ళకి కట్టినట్లు–గా పుస్తక రూపంలో తేవడంపై లోకేష్‌ను ప్రశంసించారు. ఈరోజుకు అరాచక పాలన అంతమై ఏడాది పూర్తయిందని, గత ప్రభుత్వ పాలన పీడకలను ఇప్పటికీ జనం మర్చిపోలేదన్నారు. యువగళం పాదయాత్ర నాటి అనుభవాలను ఈ సందర్భంగా డిప్యూటీ– సీఎం పవన్ కళ్యాణ్‌తో యువనేత లోకేష్ పంచుకున్నారు.



# వైసీపీ ది గొడ్డలి పోటు దినం: టీడీపి

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి గోనెగండ్ల:**



జూన్ 04 బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వైసిపి తుడిచిపెట్టుకుపోయినా వైసిపి నేతలకు చలనం లేదని వైసిపి పై గొడ్డలి పోటు దినం నిరసన కార్యక్రమం టిడిపి యూత్ - టీ ఎన్ ఏస్ ఫ్ అధ్వర్యంలో చేయటం జరిగిందనీ ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసం ద్రోహం పార్టీ ఫిరాయింపులతో ప్రభుత్వాన్ని పడదోసి అధికార పీఠాన్నించుకుంటే అది కచ్చితంగా వెన్నుపోటు అవుతుందని కానీ ప్రజాభిప్రాయాన్ని వెన్నుపోటుగా పేర్కొనడం వైసిపి పార్టీకే చెల్లిందని అన్నారు.సరిగ్గా ఏడాది క్రితం 2024 జూన్ 4 వ తేదీన జగన్ పాలన అంతమైన రోజు ఐదేళ్ల నిర్బంధానికి స్థిరపడిన రోజునీ స్వేచ్ఛకు పడిన సంకెళ్లు తెగిన రోజనీ అన్నారు.కానీ వైసీపీ పార్టీ ప్రజా తీర్పుకు విరుద్ధంగా వెన్నుపోటు దినమంటూ నిరసన తెలపడం సిగ్గు తేటని అన్నారు.జగన్ తన ఐదేళ్లపాటు మద్యం మాఫియా ఇసుక మాఫియా గంజాయి ఎర్రచందనం స్మగ్లింగ్ వైసిపి జగన్ అనుంగ అనుచరులు అటవీశాఖ భూములు అలాగే నిరుపేదల భూములకు సైతం ఆక్రమణలు చేసిన గొప్ప ఘన పాటీలు వైసిపి పెద్దలు అని అన్నారు.మద్యపాన నిషేధం చేస్తానన్న జగన్ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు.తన ఐదేళ్ల పాలనలో యువతను భారీ ఎత్తున మోసం చేసి కేవలం వాలంటరీ వ్యవస్థ పెట్టి నిరుద్యోగులను మభ్యపెట్టిన ఘనత జగన్దని అన్నారు ఎన్నికల ముందు పెద్దపెద్ద హామీలు ఇచ్చిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ అంటూ యువతను మోసం చేశారని అన్నారు.జగన్ తన ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ వేసిన పాపాన పోలేదని అన్నారు. అందుకనే నేడు వెన్నుపోటు దినం అనే బదులుగా వైసిపి గొడ్డలిపోటు దినం అంటే సరిపోతుందని అన్నారు. జగన్ తన ఐదేళ్ల చీకటి పాలనను చంద్రహాసం లాంటి మన చంద్రుడు మన చంద్రన్న వెలుగులు నింపడం జరిగిందని అన్నారు.ఈ ఐదేళ్లలో ఎక్కడ ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేసిన దాఖాలాలు లేవని అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్ అండ్ బి రోడ్లు గ్రామాల్లో పట్టణాల్లో సీసీ రోడ్లు డ్రైనేజీలు మొదలగు ప్రజా అవతరణకు భయపడే తూర్పు మాట్లాడుతూ ముందుకు సాగుతుంటే దీన్ని ఓర్వలేని జగన్ కూటమి ప్రభుత్వం పై విషం చిమ్ముతున్నారని అయినా ప్రజలు మీ కుతంత్రాలు నమ్మే పరిస్థితులు లేరన్నారు.ప్రజా తీర్పుని గౌరవించలేని వైసిపి పార్టీ రాజకీయ సమాధి కావడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యూత్ టీఎన్ఎస్ఎఫ్ సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సింహ వాహనంపై అనంతతేజోమూర్తి

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, జూన్04.**



తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన బుధవారం ఉదయం అనంతతేజోమూర్తి గోవింద రాజస్వామి సింహ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 7 నుండి 9.00 గంటల వరకు వాహనసేవ వైభవంగా జరిగింది. వాహనం ముందు గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తజన బృందాల కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.మృగాల్లో రారాజు సింహం. గాంభీర్యానికి చిహ్నం సింహం. యోగశాస్త్రంలో సింహం వాహనశక్తికి, శీఘ్రగమన శక్తికి ఆదర్శంగా భావిస్తారు. భక్తుడు సింహబలం అంతటి భక్తిబలం కలిగినప్పుడు భగవంతుడు అనుగ్రహిస్తాడు. అనంతతేజోమూర్తి శ్రీనివాసుడు రాక్షసుల మనసులలో సింహంలా గోచరిస్తాడని స్తోత్రవ్మాయం కీర్తిస్తోంది. అందుకే ధీరోదాత్తుడైన శ్రీ వేంకటేశ్వరుడు సింహవాహనాన్ని అధిరోహిస్తాడు.అనంతరం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపనతిరుమంజనం వేడుకగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పలురకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 5.30 - 06.00 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా జరగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు ముత్యపుపందిరి వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.నిత్య అలంకార ప్రియుడైన శ్రీవారు ఒక్కొక్కరోజు ఒక్కొక్క వస్త్రాభరణ అలంకారంలో దేదీప్యమానంగా వెలిగిపోతుంటాడు. ప్రత్యేకంగా మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే ముత్యపుపందిరిపై భక్తులను చల్లగా ఆశీర్వదిస్తాడు. జ్యోతిషశాస్త్రం చంద్రునికి ప్రతీకగా ముత్యాలను ప్రశంసిస్తోంది. సముద్రం మనకు ప్రసాదించిన మేలివస్తువులలో ముత్యం ఒకటి. చల్లని ముత్యాల కింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూరుస్తుందనడంలో సందేహం లేదు.ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి, టిటిడి డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్.శాంతి, ఏఈవో శ్రీ ముని కృష్ణారెడ్డి, ఏవీఎస్వో శ్రీ మోహన్ రెడ్డి, పలువురు అధికారులు, శ్రీవారి సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మిగనూరులో 'వెన్నుపోటు దినం' బుట్టా రేణుక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

**కూటమి ప్రభుత్వ మోసాలకు వ్యతిరేకంగా ప్రజల గళం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత**

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి**



ఎమ్మిగనూరు, జూన్ 4: బుధవారం టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తోందని ఆరోపిస్తూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'వెన్నుపోటు దినం' సందర్భంగా ఎమ్మిగనూరులో ఘనంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి బుట్టా రేణుక గారి నేతృత్వంలో స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ విభాగ అధ్యక్షులు వై.రుద్ర గౌడ్ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి ,పార్టీ సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ గారు వీరితోపాటు వేలాదిమంది పార్టీ శ్రేణులు పాల్గొని నినాదాలతో కూటమి ప్రభుత్వ తీరును ఖండించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ గారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఇందులో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్, 143 హామీల అమలుపై విఫలమై ప్రజలను మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బుట్టా రేణుక గారు,"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రతి వర్గాన్ని నిరాశపరిచింది. రైతులకు ఇచ్చే పెట్టుబడి సాయం 'రైతు భరోసా', విద్యార్థుల కోసం 'విద్యా దీవెన', 'వసతి దీవెన', మహిళల కోసం 'ఆడబిడ్డ నిధి', 'అమ్మ ఒడి', నిరుద్యోగులకు భృతి వంటి పథకాలన్నీ ఊహలకే పరిమితమయ్యాయి. సంవత్సరంలోనే ప్రతి ఒక్కరికి లక్షల్లో బకాయిలు ఏర్పడ్డాయి. పెన్షన్లు తగ్గించబడ్డాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. సంక్షేమం గాలికొదిలారు" అని తీవ్రంగా విమర్శించారు.అలాగే, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై, నేతలపై, సామాజిక ఉద్యమకారులపై, జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి, అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వ తీరును చూపిస్తోందని ఆమె అన్నారు. అధికారులను కూడా వేధించడమే కాకుండా, పలువురు ఐపీఎస్ అధికారులను టార్గెట్ చేయడం కక్షసాధింపు చర్యలకే నిదర్శనమన్నారు ."ప్రజల జీవితాల్లో మార్పు తేవాలని చెప్పిన ప్రభుత్వం, నాశనం చేసిన పాలనను నెరవేరుస్తోంది. ఈ మోసపూరిత ప్రభుత్వ తీరుపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరికి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా మా గళాన్ని వినిపించుకుంటున్నాం" అని బుట్టా రేణుక స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమ-అభివృద్ధికి పెద్దపీట

**సి.బెళగల్ ఉత్తేజిత న్యూస్ జూన్ 4**



కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి రాష్ట్రంలో సంక్షేమం-అభివృద్ధికి పెద్దపీట వేసిందని సి.బెళగల్ మాజీ జెడ్పిటిసి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ పార్కు నందు కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికీ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి మిఠాయి పంచుకున్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే వృద్ధుల, వితంతు పెన్షన్లను నాలుగువేల రూపాయలకు పెంచిందని, నిరుద్యోగుల కొరకు 16,347 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి, మొదటి సంతకం మాట నిలబెట్టుకున్నామని, దీపం పథకం కింద ప్రతి ఇంటికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకు పన్నెండు వందల కోట్ల ఖర్చు చేసి 20 వేల కిలోమీటర్ల రోడ్లను బాగు చేశామని తెలిపారు. మత్స్యకారుల సేవ పథకం ద్వారా ప్రతిమత్స్యకారునికి 20వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని, 203 అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామని తెలిపారు.అలాగే గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయించామని, స్వర్ణకారుల కొరకు కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, అలాగే అధికారంలోకి వచ్చి తొలి ఏడాదిలోని 70 శాతం హామీలను అమలుచేసిన ప్రభుత్వం మరొకటి లేదని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రం సంక్షేమం అభివృద్ధి కి పెద్ద పీట వేసిందని తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు పెద్దపీట వేస్తూ 4500 కోట్లతో గ్రామాల్లో 30000 పనులకు శ్రీకారం చుట్టామని, స్వర్ణకారుల కొరకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చిన్న తిమ్మప్ప, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఎంపిటిసి ఈరన్న గౌడ్, ధనుంజయ, భీమన్న, బాలాజీ వెంకటేష్, గౌస్, దూద్ వలి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరి కోట నందు సుమారు 3 వేల మందితో పెద్ద ఎత్తున యోగ కార్యక్రమం నిర్వహణ

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి,,జూన్ 4 :**



ప్రతి ఒక్కరి దైనందిత జీవితంలో యోగ ఒక భాగం కావాలి అని జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్ ఎస్ పిలుపునిచ్చారు. బుధవారం చంద్రగిరి కోట నందు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025 కార్యక్రమము లో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ప్రజలు, జిల్లా అధికారులు,విద్యార్థులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరి దైనందిత జీవితంలో యోగ ఒక భాగం కావాలి అని, జిల్లా అంతటా యోగాంధ్ర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతొందని తెలిపారు. గౌరవ ప్రధానమంత్రి, మన రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని మన రాష్ట్రమంతట యోగాంధ్ర క్యాంపెన్ లో భాగంగా తిరుపతి జిల్లాలో ఈరోజు మనం చంద్రగిరి కోటలో యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గౌరవ ముఖ్యమంత్రి గారు మే 21 నుంచి జూన్ 21 వరకు కూడా ఈ నెల రోజులు పాటు అంత రాష్ట్రవ్యాప్తంగ, జిల్లా మండల, గ్రామ స్థాయి వరకు యోగా ప్రాముఖ్యతను గురించి ప్రతి ఒక్కరికి శిక్షణ, అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్కరి దినచర్యలో భాగంగా యోగ ఉండాలని ఉద్దేశంతో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కూడా యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము అని తెలిపారు. సచివాలయం పరిధి,వార్డు పరిధి లో అందరికీ యోగా గురించి శిక్షణ, అవగాహన కల్పిపిస్తున్నామని అందులో భాగంగానే ఇప్పటికే జిల్లావ్యాప్తంగా సుమారుగా 8 లక్షల మందిని రిజిస్ట్రేషన్ జరిగింది అని తెలిపారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు గౌరవ ప్రధానమంత్రి విశాఖపట్నం రానున్నారని, అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు చేసుకుంటూ ఈ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో గౌరవ చంద్రగిరి శాసనసభ్యుల ఆధ్వర్యంలో మిగతా అధికారుల తో కలిసి ఈ యోగ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఉన్నటువంటి అత్యంత ప్రాముఖ్యమైనటువంటి పర్యాటక ప్రదేశాల ప్రాముఖ్యతను యోగ ద్వారా అందరికి తెలియజేయడం, తద్వారా పర్యాటకం గురించి కూడా తెలిసేలాగా ఈ యోగ కార్యక్రమాన్నివిజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు వారి రోజు దినచర్యలో క్రమం తప్పకుండా వ్యాయామం చేసేలా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. . చంద్రగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మే 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు అంతర్జాతీయ యోగా ఉత్సవాల సందర్భంగా చంద్రగిరి కోట నందు యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్క పౌరుడికి ఆరోగ్యం చాలా అవసరం అని వివిధ రకాల మందులు వాడుతూ ఆరోగ్యం పాడవుతుందని యోగ చేయడం వలన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని తెలిపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దృఢ సంకల్పంతో యోగ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతొందని తెలిపారు. ఈరోజు చంద్రగిరి కోట నందు యోగా కార్యక్రమం నిర్వహించిన జిల్లా కలెక్టర్, పర్యాటక శాఖ ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ వారికి ధన్యవాదాలు అని తెలిపారు. చంద్రగిరి కోట సంబంధించి లైట్ అండ్ సౌండ్స్ ప్రముఖమైన సంస్థ ద్వారా అభివృద్ధి చేయడం జరుగుతుందని దాని ద్వారా చంద్రగిరి పర్యాటక ప్రదేశం యొక్క ప్రాముఖ్యత పెరుగుతుందని అన్నారు. ఇంకా ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చంద్రగిరి కోట నందు చేయడం వలన ఇంకా అభివృద్ధి చెందే అవకాశముంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో యోగాంధ్ర మాసోత్సవాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తెలిపారు. ప్రాచీన కాలంలో ఋషులు యోగ చేసే వారని, యోగాను రోజువారి దినచర్యలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్యం బాగుంటుందని అన్నారు.రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర మంతట పండుగ వాతావరణంలో యోగాంధ్ర కార్యక్రమాలు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశుభ్రత, పచ్చదనం వంటి కార్యక్రమాలతో పాటు అందరి ఆరోగ్యం పైన కూడా శ్రద్ధ చూపిస్తున్నారని, అంతర్జాతీయ యోగ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతవిస్తూ ముందుకు తీసుకెళుతున్నారు అని తెలిపారు. కావున ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం పైన శ్రద్ధ పెట్టి యోగాను దినచర్యగా తీసుకోవాలని అన్నారు. తుడా చైర్మన్ మాట్లాడుతూ.. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగ డే సందర్భంగా మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా గురించి గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలనేది గౌరవ ముఖ్యమంత్రి గారి ఉద్దేశమని తెలిపారు. ఈరోజు చంద్రగిరి కోటలో యోగాంధ్ర కార్యక్రమ నిర్వహించడం వలన పర్యాటకంగా అభివృద్ధి అవకాశం ఉంటుందని తెలిపారు. రోజువారి దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిడి కి గురి అవుతున్నారని దాని నుంచి బయటపడడానికి యోగ తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగా గురువు చెప్పిన విధంగా ఆసనాలను ఆసక్తిగా వింటూ ప్రజలు, అధికారులు, యువత మహిళలు ఆసనాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ నరసింహులు, తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జనార్ధన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు,మండల స్థాయి అధికారులు, మహిళలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

**ఉత్సాహంగా యోగ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు యువత, మహిళలు, విద్యార్థులు**

**ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగ ఒక భాగం కావాలి జిల్లా అంతటా యోగాంధ్రకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం : జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్**

**యోగాను రోజువారీ దిన చర్యలో ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరి ఆరోగ్యం బాగుంటుంది : చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని**

**మానసిక ఒత్తిడిని జయించేలా ప్రతి ఒక్కరు యోగ చేయాలి : తుడా చైర్మెన్ డాలర్ దివాకర్ రెడ్డి**

**ప్రతి ఒక్కరూ ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టి యోగను దిన చర్య గా చేసుకోవాలి : రాష్ట యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్**

## ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించండి.

**తిరుపతి, ఉత్తేజిత ప్రతినిధి, జూన్04.**



మానవాళికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించేందుకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారులతో బుధవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి నగరంలో 120 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్నటువంటి ప్లాస్టిక్, సింగిల్ యూస్ ప్లాస్టిక్ ని పూర్తిగా నిషేధించామని అన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా గుడ్డ, జ్యూట్ బ్యాగులను, ఇతర రీసైక్లబుల్ ఐటమ్స్ ని వాడుకునే విధంగా, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో ఉన్న ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అందరూ పూర్తి స్థాయిలో పాల్గొనాలని అన్నారు. ఈ ప్లాస్టిక్ బీట్ - ప్లాస్టిక్ పొల్యూషన్ ని మూడు నెలల్లో తిరుపతిలో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో ఉన్నటువంటి దుకాణదారులు, పెద్దపెద్ద మాల్స్ యజమానులు అందరూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, వివిధ సంస్థల వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు..

## పేదలు దిక్కులేని వారికి నిత్యవసర సరుకులు అందజేత

### దేవనకొండ మండలం తర్నకల్ గ్రామం లో

**కర్నూలు జిల్లా ఉత్తేజిత ప్రతినిధి దేవనకొండ జూన్ 04 బుధవారం**



లిపూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వారు నిర్వహించిన మనం సామాజిక సేవలో కార్యక్రమం దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలో దేవనకొండ మండల అధ్యక్షులు ఉప్పర లక్ష్మన్న ఆధ్వర్యంలోపూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సింగనేటి నరసన్న తెర్నకల్లు గ్రామ సర్పంచ్ అరుణ్ కుమార్ దేవనకొండ మండలం అధ్యక్షులు ఉప్పర లక్ష్మన్న చేతులమీదుగా పేద అనాథ వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారువారు మాట్లాడుతూ మదర్ తెరిసా సావిత్రిబాయి పూలే మహాత్మ జ్యోతిబాపూలే గాడ్గే బాబా బాబాసాహెబ్ అంబేద్కర్ పేదలు అనాథలు దిక్కులేని వారికి ఎందరో మహానుభావులు సేవ చేస్తూ రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులను విద్య వైద్యం ఉపాధి న్యాయం అధికారం పేదవాడికి అందినప్పుడే దేశంలో పేదరిక నిర్మూలన జరుగుతుందని కోరుకున్న బాబాసాహెబ్ అంబేద్కర్ కలలను సహకారం చేయాలని ఒకరినొకరు ఐక్యత కలిగి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి చేయుతనదించినప్పుడే మనిషి మహనీయులవుతారని తెలిపారు ఎమ్మిగనూరులో ఉన్న పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ పేద అనాథ బాల బాలికల సంరక్షణ కేంద్రం ద్వారా పిల్లలకు మంచి విద్య ఆహారం అందిస్తూ సింగనేడు నరసన్న ప్రతిభ భారతి చేస్తున్న సేవలను బట్టి అభినందిస్తున్నామని తెర్నేకల్ గ్రామ సర్పంచ్ అరుణ్ కుమార్ పెద్దలు అభినందించారు ప్రతి ఒక్కరూ మనం సామాజిక సేవా కార్యక్రమంలో భాగమవ్వాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో బహుజన ఆటో యూనియన్ సభ్యులు యం మహేష్ కె కిరణ్ జి రమేష్ రాజు జి ప్రశాంత్ పూలే అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ సభ్యులు మాబు సూరి బహుజన రైతు కూలీ సంఘం ఏసేపు శాంతి రాజు పిలిప్పు ఏసన్న మహిళలు తదితరులు పాల్గొన్నారు

## దూసుకెళ్తున్న బంగారం ధర.. లక్ష దాటేసి ఇంకా పైపైకి!



దిల్లీ: దేశీయంగా లక్ష రూపాయల మార్క్ దాటి ఆల్‌టైమ్ గరిష్ఠాలకు చేరిన బంగారం ధర.. మరింత పైకి చేరింది. సోమవారం సాయంత్రం తొలిసారి లక్ష రూపాయలు దాటిన 10 గ్రాముల మేలిమి పసిడి ధర.. తాజాగా మరో రూ.2 వేలు పెరిగింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి రూ.1,02,000కు చేరింది. అంతర్జాతీయంగా చూస్తే ఔన్సు బంగారం ధర (31.10 గ్రాములు) 3,467 డాలర్లు పలుకుతోంది.

అటు మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలోనూ 10 గ్రాముల పసిడి ధర లక్ష రూపాయలకు చేరువైంది. వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ దీని ధర పెరిగింది. జూన్ నెల డెలివరీ కాంట్రాక్ట్ ధర మంగళవారం ఇంట్రాడేలో రూ.1,899 పెరిగి రూ.99,178కి చేరింది. ఆపై రూ.98,880కు తగ్గింది. ఆగస్టు కాంట్రాక్ట్ ధర రూ.99,800 వద్ద కొనసాగుతుండగా.. అక్టోబర్ కాంట్రాక్ట్ గోల్డ్ మాత్రం ఏకంగా రూ.2వేలు పెరిగి లక్ష రూపాయల మార్కు దాటేసింది.

**అక్షయ తృతీయపై ప్రభావం?**

సాధారణంగా అక్షయ తృతీయకు ఎంతోకొంత బంగారం కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కానీ, బంగారం ధరలు రికార్డుస్థాయిలో ఉండడంతో కొనుగోలుదారులు వెనకడుగు వేస్తున్నారు. అటు బంగారం వర్తకుల్లోనూ ఇదేతరహా అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొనుగోళ్లు తగ్గే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అక్షయ తృతీయ రోజు నాటికి (ఏప్రిల్ 30న) బంగారం కాస్త అయినా తగ్గుతుందేమోనని చూస్తున్నారు. ఒకవేళ ఇదేస్థాయిలో ధరలు కొనసాగితే ఆ మేర అమ్మకాలపై కొంతమేర ప్రభావం పడే అవకాశం ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**కారణమేంటి?**

టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాల దిశగా ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు చైనాతో మాత్రం వివాదం కొనసాగిస్తోంది. అయితే, వడ్డీ రేట్ల కోత విషయంలో ఫెడ్ చీఫ్ జెరోమ్ పోవెల్, ట్రంప్ మధ్య వివాదం నెలకొంది. దీంతో అమెరికా ఆర్థిక వ్యవస్థ గురించి, ఆ దేశ రుణాల గురించి మదుపర్లలో ఆందోళన నెలకొంది. మరోవైపు చైనా సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంద్ర బ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తుండడంతో పసిడి ధర పెరుగుతోందని అనలిస్టులు పేర్కొంటున్నారు.

## ఈ ఏడాది 7 శాతం పెరగనున్న సిమెంట్ డిమాండ్ - క్రిసిల్



ఈ ఆర్థిక సంవత్సరంలో భారత సిమెంట్ రంగం డిమాండ్ 6.50-7.50% పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా వేసింది. ముఖ్యంగా దేశంలో మౌలిక సదుపాయాల వ్యయం పెరగడం, ఈ సీజన్‌లో రుతుపవనాలు ఆశాజనకంగా ఉంటాయనే అంచనాలు ఉండడం వల్ల గ్రామీణ గృహాల నిర్మాణాలు ఊపందుకుంటాయని, అందుచేత సిమెంట్ రంగానికి డిమాండ్ పెరుగుతుందని ఒక అంచనా. మౌలిక సదుపాయాల పరంగా..రోడ్లు, రైల్వే రంగాలు సిమెంట్ డిమాండ్‌ను పెంచుతాయని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదించింది. అంతేకాకుండా ప్రభుత్వ పథకాల జోరు, వడ్డీ రేటు కోతల ప్రభావం వల్ల పట్టణ గృహ నిర్మాణ రంగం కూడా పుంజుకుంటుందని అంచనా. ప్రధాన మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖలకు బడ్జెట్ కేటాయింపులలో 10 శాతం పెరుగుదల, సాధారణం కంటే ఎక్కువ రుతుపవనాలు వ్యవసాయ లాభదాయకతను పెంచుతాయని, తద్వారా గ్రామీణ గృహ డిమాండ్ పెరుగుతుందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక తెలిపింది.దేశీయ సిమెంట్ డిమాండ్‌లో 29-31 శాతం వాటా కలిగిన మౌలిక సదుపాయాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా కీలకమైన సిమెంట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉంటాయని నివేదిక తెలిపింది. మౌలిక సదుపాయాలలో రోడ్లు అతిపెద్ద వాటాదారుగా ఉన్నాయి, తరువాత రైల్వేలు, నీటిపారుదల, పట్టణ మౌలిక సదుపాయాలు ఉన్నాయి.

## ఎయిర్‌టెల్ చేతికి అదానీ డేటా నెట్‌వర్క్స్ స్పెక్ట్రమ్!

దిల్లీ: ప్రముఖ టెలికాం నెట్‌వర్క్ భారతీ ఎయిర్‌టెల్, తన అనుబంధ సంస్థ భారతీ హెక్సాకామ్ కలిసి అదానీ గ్రూప్‌తో ఒప్పందం చేసుకుంది. అదానీ డేటా నెట్‌వర్క్స్‌కు చెందిన 26 %+ఎఓ% బ్యాండ్‌లోని 400 మెగాహెర్జ్ స్పెక్ట్రమ్‌ను వినియోగించుకునేందుకు డీల్ కుదుర్చుకుంది. తద్వారా ఎయిర్‌టెల్ తన 5జీ సామర్థ్యాలను, నెట్‌వర్క్ కెపాసిటీని పెంచుకోనుంది. నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ పూర్తి కానుంది. ఈ డీల్‌కు సంబంధించిన ఆర్థిక వివరాలు తెలియరాలేదు.

2022లో నిర్వహించిన స్పెక్ట్రమ్ వేలంలో అదానీ డేటా నెట్‌వర్క్స్ 400వీస్త్రఓ స్పెక్ట్రమ్‌ను రూ.212 కోట్లకు దక్కించుకుంది. మొత్తం ఆరు సర్కిళ్ల పరిధిలో ఉన్న ఈ స్పెక్ట్రాన్ని డీల్‌లో భాగంగా ఎయిర్‌టెల్ వినియోగించుకోనుంది. గుజరాత్ (100 వీఎఓ), ముంబయి (100 వీఎఓ), ఆంధ్రప్రదేశ్ (50 వీఎఓ), రాజస్థాన్ (50 వీఎఓ), కర్ణాటక (50 వీఎఓ), తమిళనాడు (50 వీఎఓ)లోని స్పెక్ట్రమ్‌ను ఎయిర్‌టెల్ వాడుకోనుంది. అదనపు స్పెక్ట్రమ్ వల్ల అధిక వేగంతో కూడిన డేటాను వినియోగదారులకు అందించడంతో పాటు, నెట్‌వర్క్ సామర్థ్యాన్ని మరింత పెంచుకుని నాణ్యమైన సేవలను యూజర్లకు అందించడంలో ఎయిర్‌టెల్‌కు ఇది దోహదపడుతుంది.

## 28 నుంచి ఏథర్ ఎనర్జీ ఐపీఓ.. ఈ ఏడాదికిదే తొలి పబ్లిక్ ఇష్యూ!



మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో మదుపర్లు ఐపీఓ అనే పదం విని చాలా రోజులే అయ్యింది. గడిచిన రెండున్నర నెలలుగా ఐపీఓల సందడే దాదాపు కనుమరుగైంది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓకు సిద్ధమైంది. ఏప్రిల్ 28 నుంచి దీని సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెయిన్ బోర్డు నుంచి పబ్లిక్ ఆఫర్‌కు వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం గమనార్హం.

ఏథర్ ఎనర్జీ సంస్థ ఈ పబ్లిక్ ఇష్యూలో తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,626 కోట్లు సమీకరించనుంది. వాస్తవానికి రూ.3,100 కోట్లు సమీకరించాలని తొలుత లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో పాటు 1.1. కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రమోటర్లు, వాటాదారులు తమ వాటాలను ఆ మేర తగ్గించుకోనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను మహారాష్ట్రలోని ద్విచక్ర వాహన ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రుణాన్ని తగ్గించుకునేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. కొంత మొత్తాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు పెంచుకోవడానికి వినియోగించబోతోంది.

## రామ్‌దేవ్ బాబా వ్యాఖ్యలు షాక్‌కు గురిచేశాయి: దిల్లీ హైకోర్టు



యోగా గురువు రామ్‌దేవ్ బాబాపై దిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. హమ్‌దార్ద్ పానీయం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయం కావని పేర్కొంది. కొన్ని రోజుల క్రితం హమ్‌దార్ద్ షర్బత్ గురించి రామ్‌దేవ్ బాబా పరోక్షంగా తీవ్ర ఆరోపణలు చేశారు. దానిని కొనుగోలు చేయడం వల్ల వచ్చే లాభాలను కంపెనీ వేరొక వర్గానికి చెందిన నిర్మాణాలు చేపట్టేందుకు ఉపయోగిస్తోందన్నారు. "అదే ఈ షర్బత్ (పతంజలి సంస్థకు చెందిన పానీయం) తాగితే.. గురుకులాలను నిర్మించవచ్చు. పతంజలి విశ్వవిద్యాలయాన్ని విస్తరించవచ్చు" అంటూ రామ్‌దేవ్ మాట్లాడారు. దానికి సంబంధించిన వీడియో వివాదాస్పదమైంది. ఈ క్రమంలో హమ్‌దార్ద్ కంపెనీ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. వెంటనే ఆ వీడియోను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

హమ్‌దార్ద్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఇది ఆ సంస్థ ఉత్పత్తిని అగౌరవపరచడం కంటే తీవ్రమైందని, అవి ద్వేషపూరిత వ్యాఖ్యల కిందికే వస్తాయని వాదించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. "ఈ వ్యాఖ్యలు కోర్టు అంతరాత్మను షాక్‌కు గురిచేశాయి. ఇలాంటి వ్యాఖ్యలు ఎంతమాత్రం సమర్థనీయం కాదు" అని తీవ్రంగా స్పందించింది.

గతంలో తప్పుదోవ పట్టించే ప్రకటనల వ్యవహారంలో పతంజలి ఆయుర్వేద్ సంస్థ వ్యవస్థాపకులు రాందేవ్ బాబా , ఎండీ ఆచార్య బాలకృష్ణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పిన సంగతి తెలిసిందే. ఆ ప్రకటనల కేసుపై సుప్రీంకోర్టులో విచారణ కూడా జరిగింది. ఇకపై అలాంటి యాడ్స్ ఇవ్వబోమని వారు కోర్టుకు విన్నవించారు. ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం.. వారిపై ధిక్కరణ కేసును మూసివేసింది. అయితే, తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది.

## ఆరో రోజూ లాభాల్లో సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఆరో రోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. మన సూచీలు రాణించాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్ల అండతో మన సూచీలు లాభాల్లో ముగిశాయి. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ దాదాపు 6వేల పాయింట్ల మేర పెరిగింది. 80 వేల మార్కుకు చేరువవుతోంది.

సెన్సెక్స్ ఉదయం 79,728.39 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,408.50) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 79,824.30 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 187 పాయింట్ల లాభంతో 79,595.59 వద్ద ముగిసింది. నిఫ్టీ 41.70 పాయింట్ల లాభంతో 24,167.25 పాయింట్ల వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.19గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎటర్నెల్ (జొమాటో) షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్స 3,477 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## బిగ్ బ్యాటరీ, కర్వ్ డిస్‌ప్లేతో వివో కొత్త 5జీ ఫోన్

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో కొత్త 5జీస్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసింది. టి సిరీస్‌లో వివో టి4 5జీ పేరిట దీన్ని కంపెనీ లాంచ్ చేసింది. బిగ్ బ్యాటరీ, ఫాస్ట్ ఛార్జింగ్, కర్వ్ డిస్‌ప్లేతో ఈ ఫోన్ వస్తోంది. ఫోన్ ధర, ఫీచర్లతో పాటు అమ్మకాల వివరాలు ఇప్పుడు చూద్దాం..

వివో టి4 5జీ 6.77 అంగుళాల ఫుల్ హెచ్‌డీం అమోలెడ్ క్వాడ్ కర్వ్‌డ్ డిస్‌ప్లేతో వస్తోంది. 120%ఎఓ% రిఫ్రెష్ రేటు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో తీసుకొచ్చారు. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జనరేషన్ 3 ప్రాసెసర్‌ను అమర్చారు. ఆండ్రాయిడ్ 15తో కూడిన ఫన్‌టచ్ ఓఎస్ 15 ఉన్నాయి.

వెనుక వైపు 50 ఎంపీ కెమెరా, 2 ఎంపీ సెకండరీ కెమెరా ఉన్నాయి. ముందువైపు 8 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఇక బ్యాటరీ విషయానికొస్తే ఇందులో 7,300 %పొూష్త్ర% బ్యాటరీ ఉంది. 90%ఔ% ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. ఇన్ డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్, ఐపీ65 రేటింగ్‌తో వస్తోంది.

ఈ ఫోన్ మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీం128జీబీ వేరియంట్ ధర రూ.21,999, 8జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.23,999బీ 12జీబీం256జీబీ వేరియంట్ ధర రూ.25,999గా కంపెనీ నిర్ణయించింది. ఎమరాల్డ్ బ్లేజ్, ఫాంటమ్ గ్రే రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, వివో ఇండియా ఇ-స్టోర్‌తో పాటు ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో కొనుగోలు చేయొచ్చు.

## అమెజాన్, వాల్‌మార్ట్ కోసం భారత్‌పై అమెరికా ఒత్తిడి!

దేశీయంగా దాదాపు 125 బిలియన్ డాలర్ల ఈకామర్స్ మార్కెట్లో తమ సంస్థల పట్టు పెంచేందుకు భారత్ పై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ఓ కథనంలో పేర్కొంది. న్యూదిల్లీపై దాదాపు 26శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఈ చర్చలో ఈకామర్స్ అంశం కూడా వచ్చింది.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కోసం విస్తృతస్థాయిలో జరుగుతున్న సదస్సుల్లో ఈకామర్స్ రంగంలోని అన్ని సంస్థలకు సమాన అవకాశాలు, పరిస్థితులు కల్పించే అంశంపై చర్చ జరిగింది. తాజాగా భారత్ పర్యటనలో ఉన్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ చర్చలపై స్పందిస్తూ.."ఇరుపక్షాల ప్రయోజనాలను కాపాడేలా చెప్పుకోదగ్గ పురోగతి సాధించాం. ఇంధన, రక్షణ, వ్యూహాత్మక టెక్నాలజీల రంగంలో సహకారాన్ని బలోపేతం చేసుకొంటాం" అని పేర్కొన్నారు.

వాల్‌మార్ట్ అధినేత మెక్‌మిలన్ కొన్నాళ్ల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా భారత్‌లో ఈ కామర్స్ కంపెనీలకు ప్రభుత్వం విధించిన నిబంధనలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భారత్‌లో ఫ్లిప్‌కార్ట్ యాజమాన్యం వాల్‌మార్ట్ చేతిలో ఉన్న విషయం తెలిసిందే. భారత్‌లో ప్రైస్ ఓపెన్ విధానం అమలుచేయాలని ఒత్తిడి చేస్తోంది. దీంతోపాటు.. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సంస్థలు దేశీయ రిటైల్ దిగ్గజమైన రిలయన్స్‌తో పోటీపడాలని బలంగా భావిస్తున్నారు.




భారత్‌లో విదేశీ ఈకామర్స్ సంస్థలు కేవలం ఇతరులు తయారుచేసిన వస్తువులను కస్టమర్లకు విక్రయించడానికే వినియోగించాలన్న నిబంధన ఉంది. అదే భారత్‌కు చెందిన కంపెనీలు తయారుచేసిన వస్తువులు సొంత ప్లాట్‌ఫామ్‌ల్లో విక్రయించుకొనే అవకాశం ఉంది. దీనిని టారీఫేతర అడ్డంకిగా అమెరికా ఆరోపిస్తోంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పరిమితిని కూడా ఇలానే పోలుస్తుంది.

2006 నుంచి భారత్ దేశీయ మార్కెట్లను తమ కంపెనీలకు తెరిపించేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది. కానీ, దీనికి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటోంది. ఇక దీనికితోడు భారత్‌లోని విదేశీ ఈకామర్స్ వేదికలు తరచూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ తనిఖీలకు లక్ష్యంగా మారుతున్నాయని ఆయా కంపెనీలు చెబుతున్నాయి.

ఈనేపథ్యంలో భారత్‌తో చర్చల సమయంలో తమ దేశ ఈకామర్స్ దిగ్గజాలను అమెరికా చాలా జాగ్రత్తగా సమన్వయం చేసుకొంటోందని ఈ విషయంతో సంబంధం ఉన్నవారు చెప్పినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. ఈ క్రమంలోనే భారత ఈకామర్స్ మార్కెట్‌ను తమ సంస్థలు మరింతగా తెరవాలని న్యూదిల్లీపై ఒత్తిడి తీసుకొస్తోంది. "విదేశీ పెట్టుబడులు దేశంలోకి రావడం స్వాగతించదగిన విషయమే. కానీ, మూల్యంగా భారత రిటైల్ మార్కెట్‌ను ఇష్టానుసారం మార్చేసి.. చిరు వ్యాపారుల ప్రయోజనాలను దెబ్బతీయడం కాదు" అని కన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ పేర్కొన్నారు.

2013లో భారత్‌లో అడుగుపెట్టిన నాటినుంచి అమెజాన్ ఇండియా వరుసగా తన పట్టు పెంచుకొంటూ వస్తోంది. కాకపోతే ఫ్లిప్‌కార్ట్ నుంచి తీవ్రమైన పోటీ ఎదుర్కొంటోంది.

# తెల్లబట్టలపై మరకలు పోతాయ్..



తెల్ల బట్టలు వేసుకోవడానికి ఎంత బావుంటాయో.. వాటిని మెంటెయిన్ చేయడం కూడా అంతే కష్టం. ముఖ్యంగా కాలర్, అండర్ ఆర్మ్స్ మీద మరకలు అలానే ఉండిపోతాయి. ఏం చేస్తే ఈ మరకలు పోతాయో అస్సలు తెలియవు. అందుకే ఇప్పుడు చెప్పే ఈ టిప్స్‌తో సమస్యని దూరం చేసుకోండి. వైట్ క్లాత్స్‌పై ఏ చిన్న మరక పడినా అది వదలడం చాలా కష్టం. అందుకే వాటిని సెపరేట్‌గా ఉతకండి. ఇతర బట్టలతో కలిపి ఉతకొద్దు. ఎందుకంటే, వాటి రంగులు తెల్ల బట్టలకి అంటుకుని మొండి మరకల్లా మారతాయి. వీటిని కెమికల్స్‌తో నిండిన సబ్బు, డిటర్జెంట్ లిక్విడ్స్‌తో రుద్దితే ఉన్న తెల్లదనం తగ్గిపోతుంది. తెల్లని బట్టల్ని ఎక్కువసేపు ఎండలో ఆరబెట్టొద్దు. కొద్దిసేపు ఆరబెడితే చాలు. ఎక్కువగా వేడి ఉన్న ప్రాంతంలో ఆరేస్తే కలర్ చేంజ్ అవుతాయి. కాబట్టి, అలా చేయకండి.

చాలా మంది బట్టలకి బ్లీచ్ వాడుతుంటారు. వీటిని వాడాలనుకుంటే కాటన్ వాటికి వాడండి. అన్ని బట్టలకు వద్దు. వీటిని వాడడం వల్ల బట్టలు పాడయ్యే అవకాశం ఉంది. చాలా మంది బట్టలు తెల్లగా మారాలని ఎక్కువగా సబ్బు వాడతారు. దీని వల్ల తెల్ల బట్టలపై మురికి పోతుంది. కానీ, తెలుపుదనం తగ్గుతుంది. కాబట్టి, కొద్దిగా మాత్రమే సబ్బుని వాడండి. నీలిరంగు.. ఆప్టికల్ బ్రైటెనర్స్‌ని పిలిచే నీలిరంగుని వాడతారు. వీటిని వాడితే బట్టలు తెల్లగా మారతాయి. ఈ బ్లూయింగ్ ఏజెంట్‌ని వాషింగ్ మెషిన్‌లో డిటర్జెంట్ డిస్పెన్సర్‌కి జోడించవచ్చు. నిమ్మరసం.. నిమ్మరసం కూడా తెల్ల బట్టలపై మరకల్ని ఈజీగా దూరం చేస్తుంది. ఇందులోని బ్లీచింగ్ ఏజెంట్‌లా పనిచేస్తుంది. ఇది తెల్లని బట్టలపై మురికిని దూరం చేస్తుంది. ఇందుకోసం ముందు రోజు నిమ్మకాయ రసాన్ని మరకలపై రాసి వేడి నీటిలో నానబెట్టండి. హైడ్రోజన్ పెరాక్సైడ్.. అదే విధంగా, డిటర్జెంట్‌కి హైడ్రోజన్ పెరాక్సైడ్‌ని కలపండి. తెల్లని బట్టల కాలర్లు, అండర్ ఆర్మ్స్ ప్రాంతాల్లోని మురికిని దూరం చేసేందుకు వాడొచ్చు. ఇలా చేయడం వల్ల చాలా వరకూ మరకలు దూరమవుతాయి.





# ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే....



సమ్మర్‌లో కూరగాయలు, పండ్లు త్వరగా వాడిపోతాయి. అలా కాకుండా ఉండాలంటే వీటిని ఎలా స్టోర్ చేసుకోవాలో తెలుసుకోండి. సాధారణంగా చాలా మంది ఫ్రిజ్‌లో పండ్లు, కూరగాయలు పెడుతుంటారు. ఎందుకంటే ఫ్రిజ్‌లో వీటిని పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి. కానీ, కొన్నిసార్లు పండ్లు, కూరగాయల్ని ఫ్రిజ్‌లో పెట్టినా పాడవుతుంటాయి. దీనికి కారణాలు ఏంటి. ఎందుకిలా త్వరగా పాడవుతాయి. మరి వీటిని ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.

అన్నింటిని ఒకేదగ్గర వద్దు.. కూరగాయలు, పండ్లలో చాలా ఎంజైమ్స్ ఉంటాయి. వీటిని అన్నింటిని ఒకేదగ్గర పెడుతుంటారు చాలా మంది. దీంతో కొన్ని కూరగా యలు, పండ్లు ఇథలీన్‌ని ఉత్పత్తి చేస్తాయి. దాంతో అవి త్వరగా కుళ్ళిపోతాయి. అటువంటి కూరగాయలు, పండ్లని ఎలా స్టోర్ చేయాలో తెలుసుకోండి. క్యాబేజీ.. క్యాబేజీ కూడా తాజాగా ఉండాలంటే స్వచ్ఛమైన గాలి అవసరం. అందుకే, యాపిల్స్, పుచ్చకాయలు, కివీస్ వంటి పండ్లతో వీటిని కలిపి పెట్టొద్దు. ఇవన్నీ కూడా ఇథలీన్‌ని రిలీజ్ చేసే పండ్లు. కాబట్టి, వీటికి దూరంగా ఉంచి స్టోర్ చేయడం అవసరం.

సోరకాయతో వద్దు.. సోరకాయ, పొట్లకాయ వంటి కూరగాయల్ని యాపిల్, ద్రాక్ష, అంజీర్ వంటి పండ్లతో కలిపి ఒకే దగ్గర స్టోర్ చేయొద్దు. ఎందుకంటే ఇవి కూడా ఇథిలీన్‌ని రిలీజ్ చేస్తాయి. దీంతో త్వరగా పాడవుతాయి.బ్రకోలీతో ఫ్రూట్స్ వద్దు.. బ్రకోలీతో ఫ్రూట్స్ వద్దు.. బ్రకోలీకి ఇథలీన్ పడదు. కాబట్టి.. మీరు దీనిని ఆపిల్, అత్తి, ద్రాక్ష పండ్ల వంటి ఇథలీన్ ఉత్పత్తి చేసే పండ్లతో బ్రకోలీని పెడితే అది త్వరగా పాడవుతుంది. అందుకే వాటిని ఈ పండ్లతో కలిపి పెట్టొద్దు.. ఆకుకూరలతో ఇవి వద్దు.. ఆకు కూరలు తాజాగా ఉండాలంటే వాటిని సెపరేట్‌గా ప్యాక్ చేసి పెట్టాలి. వీటికి దగ్గర్లో పుచ్చకాయ, ద్రాక్ష, యాపిల్స్ వంటి ఇథలీన్ రిలీజ్ చేసే పండ్లతో కలిపి పెట్టొద్దు. దీని వల్ల ఆకుకూరలు త్వరగా పాడవుతాయి. అందుకే వీటికి సెపరేట్‌గా పెట్టండి.




# గులాబీ మొక్కకి పూలు ఎక్కువ పూయాలంటే...

వర్షాలు మొదలయ్యాయి. ఈ సమయంలో చాలా మంది మొక్కలు పెడుతుంటారు. పూ మొక్కలు అంటే చాలా మందికి ఇష్టం. ఇందులో గులాబీలు ప్రత్యేకం. మరి ఆ చెట్లకి పువ్వులు ఎక్కువగా పూయాలంటే ఏం చేయాలి.

గులాబీ మొక్కకి పూలు ఎక్కువ పూయాలంటే ఇలా చేయండి.. కొంతమంది మొక్కలు పెంచుతారు. అలాంటప్పుడు కొన్ని పొరపాట్లు కూడా ఉంటాయి. అలానే గులాబీ మొక్కలు పెంచేటప్పుడు కూడా కొన్ని తప్పులు చేస్తుంటారు. మొక్కలు ఆరోగ్యంగా పెరగాలంటే మనం కొన్ని విషయాలు పాటించాలి. అప్పుడే అవి ఎక్కువ పూలు పూస్తాయి. అవేంటో ఇప్పుడు చూద్దాం. కొనేటప్పుడు.. మీరు గులాబీ మొక్కను కొనేటప్పుడు ఆల్రెడీ పూలు ఉంటే వాటిని తీసి వేయండి. అప్పుడే కొమ్మలు మాత్రమే పెరుగుతాయి. గులాబీ మొగ్గలు వస్తాయి. కాబట్టి, కొనేటప్పుడు ఏమైనా పూలు వుంటే తీసేయండి. ఎక్కడ నాటాలి.. గులాబీ మొక్కల్లో చాలా రకాలు ఉన్నాయి. కాబట్టి, మనం ఏది కొంటున్నామో కూడా తెలుసుకోవాలి. గులాబీలను వెలుతురు ఉన్న ప్రదేశంలో పెట్టాలి. రెగ్యులర్‌గా ప్లేసెస్ మార్చొద్దు. తర్వాత దీనికి మంచి కంపోస్ట్ రిచ్ మట్టిని వాడాలి. కనీసం





రెండు అడుగుల లోతులో గులాబీలను నాటండి. మీరు కంపోస్ట్, మట్టిని కలిపి వాడొచ్చు.

నీరు పోయడం.. గులాబీలకు నీరు పోయడం కూడా చాలా ముఖ్యం. పొడి వాతావరణంలో నీరు సరిగ్గా పట్టాలి. నీరు పోసేటప్పుడు ఆకులపై నీరు పడకుండా చూడాలి.

వేప మిశ్రమం.. గులాబీ మొక్కలు ఆరోగ్యంగా ఉండాలంటే మట్టితో పాటు వేప పొడి కలిపి గులాబీ మొక్కలు నాటాలి. ఇది ఎక్కువగా ఎరువుల దుకాణాల్లో దొరుకుతుంది ఇలా నాటితే పురుగులు పట్టకుండా మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయి. రాలుతున్న పూలు.. ఎప్పటికప్పుడు రాలే పూలను తీసేయాలి. దీని వల్ల కొత్త పూలు వస్తాయి. గులాబీలు వసంతకాలం నుండి చివరి శరదృతువు వరకు విసకిస్తాయి. వాటిని చూసినప్పుడల్లా రాలుతున్న పూలని తీసేయాలి.

పురుగు మందులు.. అదే విధంగా, గులాబీ మొక్కలకి బయట దొరికే పురుగు మందులు బదలు ఇంట్లోనే కొన్ని సహజ క్రిమి సంహారకాలు తయారు చేయొచ్చు. అందుకోసం వేపాకులు తీసుకుని అందులో వెల్లుల్లి తొక్క వేసి మొత్తగా మిక్సీ పట్టి ఈ మిశ్రమాన్ని ఫిల్టర్ చేసి స్ప్రే బాటిల్‌లో వేయాలి. దీనిని స్ప్రే చేస్తుంటే చీడపీడలు, కీటకాలు, చీమలు వదులుతాయి.





# పిల్లల గది ఇలా డిజైన్ చేస్తే..



పిల్లల రూమ్ డిజైన్ చేయడం..

తల్లిదండ్రులకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. పిల్లలకు నచ్చేలా, వారి ఇష్టాలకు అనుగుణంగా రూమ్ డిజైన్ చెయ్యాలనుకుంటారు. పిల్లల రూమ్ ఎలా డిజైన్ చేయాలో ఈ స్టోరీలో చూద్దాం. తల్లిదండ్రులకు ఎప్పుడూ ఎగ్జైటింగ్‌గానే ఉంటుంది. పిల్లల గది డిజైన్ చేయడం అంత ఈజీ కాదు. పిల్లలకు ఏమి ఇష్టం, ఆసక్తి, వారి ఆలోచనలను దృష్టిలో ఉంచుకుని వారి గదిని అలంకరించాలి. చిన్నారుల్లో సృజనాత్మక శక్తిని మేల్కొలిపేలా, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేలా వాళ్ల గది డిజైనింగ్ ఉండాలి. పిల్లలకు అదే ప్రపంచం.. ఆ గదిలోనే ఆడతారు, చదువుకుంటారు, నిద్రపోతుంటారు. పిల్లల రూమ్ డిజైన్ చేసేప్పుడు.. గుర్తుపెట్టుకోవలసిన ముఖ్యమైన విషయాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

పిల్లలు ఎక్కువగా ముదుర రంగులను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. వారి రూమ్‌లో ఒకే గోడకు ముదురు రంగులు వేయించండి. మానసిక శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం చిన్న పిల్లలు ఎరుపు, నీలం, పసుపు రంగులను ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. ఇవి కాకుండా ఆకుపచ్చ, పర్పుల్ కూడా వారికి నచ్చుతాయి. మొత్తం అంతా ఒకే రంగు కాకుండా గదిలో వేర్వేరు చోట్ల వేర్వేరు రంగులను వేయించండి. ఒక గోడ మీద కార్టూన్‌లు, బొమ్మలు, వాళ్ల ఫేవరెట్ కార్టూన్, కథల్లోని పాత్రలను గోడ మీద వేయించవచ్చు.

కార్టూన్లు, బొమ్మలతో వాల్‌పేపర్లు వస్తున్నాయి. వాటిని గోడమీద అంటించొచ్చు. ప్రయాణాలంటే ఇష్టపడుతున్నా, వారిలో అటువంటి ఆలోచనలు తేవాలన్నా ప్రపంచ పటం వాల్‌పేపర్‌గా ఉంటే బావుంటుంది. స్టార్స్, ట్రైయాగిల్స్, సర్కిల్ లాంటి పిల్లలకు స్పెషల్‌గా ఉంటాయి.

చిన్నారుల కోసం ఫర్నీచర్, మంచం లాంటివి కొనేప్పుడు ఆకారాల్లో, రంగుల్లో ఆకర్షణీయంగా, భిన్నంగా ఉండేట్లు చూడాలి. బెడ్ అందంతో పాటు పిల్లల భద్రత, సౌకర్యాలకు కూడా ప్రాధాన్యమివ్వాలి. పిల్లల పరుపు మరీ గట్టిగా ఉండకుండా చూసుకోవాలి. కొద్దిగా మెత్తగా ఉంటే పిల్లలు ఇష్టపడతారు. ఎక్కువ మంది పిల్లలు ఉన్నట్లయితే ప్లేస్ అడ్జెస్ట్‌మెంట్ చాలా ముఖ్యం. ఈ పరిస్థితి ఉంటే.. బంక్ బెడ్‌లు, ట్రండల్ పుల్ అవుట్ బెడ్‌లు ఎక్కువ స్థలాన్ని ఆక్రమించవు. కొన్ని ఫర్నీచర్ ఐటెమ్‌లలో, డ్రాయర్‌లను బంక్ బెడ్ మెట్లలోకి నిర్మించవచ్చు స్టడీ ఎసెన్షియల్‌లను స్టోర్ చేయడానికి వీటిని ఉపయోగించవచ్చు. పిల్లలు చదువుకోవడానికి ఓ మూల టేబులు, చైర్ ఎరేంజ్ చెయ్యాలి. మంచంలోనే చాక్‌బోర్డులను ఏర్పాటు చేసుకోవడం ఇప్పటి పిల్లల గదుల ప్రత్యేకత. పిల్లలు యాక్టివ్‌గా ఉంటారు. వాళ్ల గదిలోనే అటూ ఇటూ తిరుగుతూ ఆడుతూ ఉంటారు. వాళ్ల సేఫ్టీని దృష్టిలో ఉంచుకుని రూమ్ డిజైన్ చేయడం మంచిది. ఫర్నిచర్ స్ట్రాంగ్‌గా, క్వాలిటీగా ఉండేలా చూసుకోవాలి. ఫర్నిచర్ అంచులు గుండ్రంగా ఉండాలి. రాత్రిళ్లు నిద్రపోయే ముందు లైట్స్ ఆఫ్ చేస్తే పిల్లలు కొత్తలో భయపడతారు. చీకట్లో కూడా మెరిసేలా సీలింగ్‌కు మెటాలిక్ రంగులు వేస్తే చీకట్లోనూ భయం లేకుండా నిద్రపోతారు. పిల్లల గదిలో కంటికి శ్రమ కలిగించని ఫ్లోరోసెంట్ బల్బులను వాడాలి.





# ఏసి కచ్చితంగా రిపేర్ చేయించాలి..

ఎండాకాలంలో చాలా మంది ఏసీలు వాడుతుంటారు. వీటిని ఎప్పటికప్పుడు జాగ్రత్తగా మెంటెయిన్ చేయాలి. లేకపోతే దీనిని ఆస్వాదించలేం. కొన్ని ప్రాబ్లమ్స్ వచ్చినప్పుడు వాటిని గుర్తించి రిపేర్ చేస్తే మంచి కూలింగ్ ఫీల్‌ని పొందగలం. అవేంటో ఇప్పుడు చూద్దాం. వేడి గాలి వచ్చినప్పుడు.. చాలా మంది ఏసీలను ఆస్వాదించాలనుకుంటారు వీటిని కొన్న కొత్తలో చల్లగా ఊటీలోనో, కొడైకెనాల్‌లోనో ఉన్నట్లుగా అనిపిస్తుంది. కానీ, రోజులు గడిచేకొద్దీ ఏసీ నుంచి వేడి గాలి వస్తుంటుంది. అలాంటప్పుడు ఏం చేయాలంటే.. ఏసి టెంపరేచర్‌ని రూమ్ టెంపరేచర్ కంటే తక్కువగా సెట్ చేయండి. అయినా వేడి గాలి వస్తుంటే ఓ సారి రిపేర్ చేయించడం మంచిది. గాలి రాకపోతే.. అదే విధంగా కొన్నిసార్లు సరిగ్గా గాలి రాదు. వెంటిలేషన్ లేకపోతే ఇలా జరుగుతుంది. మీ ఏసీ కెపాసిటీ సరిగ్గా లేకపోతేనే ఇలా అవుతుంది. కాబట్టి, ఓ సారి సర్వీసింగ్ చేయించడం మంచిది. దీని వల్ల ఏసి సరిగ్గా పనిచేస్తుంది. దీంతో పాటు కొంతమంది ఏసీలు ఆన్ చేసినప్పుడు ఎక్కువగా సౌండ్ వస్తుంటుంది. అలా రాకుండా ఉండాలంటే కచ్చితంగా ఓ సారి ఏసీ రిపేర్ చేయించాల్సిందే.. ఎక్కువగా చలిగా అనిపించినప్పుడు.. సాధారణంగా రూమ్ టెంపరేచర్ చల్లగా ఉంచేందుకే ఏసీలను వాడుతుంటారు. వీటికి అనుగుణంగానే ఏసీలు వాడినప్పుడు రూమ్ టెంపరేచర్ చల్లగా అయితే, ఆపరేటింగ్ సిస్టమ్ దానంతట అదే ఆఫ్ అవుతుంది. అలా జరగకుండా రూమ్‌లో ఇంకా చల్లదనం పెరుగుతుంటే కచ్చితంగా దీనిని రిపేర్ చేయించడం మంచిది. నీరు కారడం.. ఇది కూడా ఓ ముఖ్య కారణం. ఏసీ నుంచి నీరు కారడం కరెక్ట్ కాదు. ఇది ఏసి కండిషనింగ్ యూనిట్ ప్రాబ్లమ్, కాబట్టి, ఇలా జరిగినప్పుడు కూడా వెంటనే ఏసిని రిపేర్ చేయించడం బెస్ట్. దుర్వాసన వస్తుంటే.. ఏసీ వాడినప్పుడు వాసన కొద్దిగా తేడా వస్తుందా.. అయితే దీనికి కారణం సిస్టమ్ సరిగ్గా పనిచేయకపోవడం. కాబట్టి, ఈ టైమ్‌లో కూడా వెంటనే రిపేర్ చేయించాలి. రూమ్ మొత్తం ఒకే టెంపరేచర్.. అదే విధంగా ఏసీ ఆన్ చేసినప్పుడు రూమ్ మొత్తం ఒకే టెంపరేచర్ ఉండాలి. అంతేకానీ, ఒక్కో చోట ఒక్కో టెంపరేచర్ ఉంటే ఆపరేటింగ్ సిస్టమ్‌లో ప్రాబ్లమ్ ఉన్నట్లే. కాబట్టి, ఆ సమయం లో కచ్చితంగా ఏసి రిపేర్ చేయించాల్సిందే. కరెంట్ బిల్ ఎక్కువగా రావడం.. అదే విధంగా, ఏసి వాడినప్పుడు సాధార ణంగా కరెంట్ బిల్ ఎక్కువగా వస్తుంటుంది.



# మిక్సీలో అల్లం రుబ్బుతున్నారా..



అల్లం, మసాలాలు, కొబ్బరి తురుము, ఇడ్లీ, దోశ పిండి ఇలా ఏవైనా సరే ప్రిపేర్ చేయడానికి మిక్సీని ఎక్కువగా వాడతారు. అన్ని అవసరాలకి అనుగుణంగా మిక్సీలను వాడుతుంటారు. అందులో కూరగాయలు కట్ చేయడం, చపాతీ పిండిని కలిపేందుకు కూడా డిజైన్ చేస్తున్నారు. దీంతో చాలా మంది వీటిని వాడుతూ ఆ విధంగానే తమ పనని ఈజీ చేసుకుంటున్నారు. కానీ, ఇలా చేసేటప్పుడు కొన్నింటిని గమనించాలని చెబుతున్నారు నిపుణులు.

చపాతీ పిండి.. చాలా మంది పిండిని కలిపేందుకు కూడా మిక్సీలను వాడుతుంటారు. దీనికోసం ప్రత్యేకంగా అట్టా నీడర్ ఉంటుంది. అందుకోసం వేసి పిండిని మెత్తగా కలుపుతారు. కానీ, పిండి త్వరగానే కలిసిపోతుంది. కానీ, చేతితో కలిపినట్లుగా ఉండదు. దీనివల్ల చపాతీలు కూడా బాగా రావు. కాబట్టి, చేతితో కలపడం మంచిది.



వేడి వేడి ఫుడ్స్.. వేడి వేడి ఫుడ్స్.. అదే విధంగా కొన్నింటిని ఫ్రై చేసి అవి వేడిగా ఉండగానే మిక్సీలో వేస్తారు చాలా మంది. అలా ఎప్పుడు చేయకూడదు. దీని వల్ల జార్ త్వరగా పాడవుతుంది. అంతేనా, విరిగిపోతుంది కూడా. అలా కాకుండా వాటిని కాస్తా గోరువెచ్చగా అయ్యేవరకూ ఉండి ఆ తర్వాత వాటిని మిక్సీ పట్టాలి. అల్లం వెల్లుల్లి.. అల్లం వెల్లుల్లిని చాలా మంది మిక్సీ జార్‌లోనే వేస్తారు. ఇది అందరూ చేసేదేగా ఎందుకు వద్దు అనుకుంటున్నారా.. వీటిని ఎక్కువ పరిమాణంలో చేస్తే త్వరగా అయ్యేందుకు మిక్సీ వాడొచ్చు. అదే తక్కువగా చేస్తే వాటిని చిన్న జార్‌లో వేసే బదులు చిన్న రోలులో వేయాలి. ఎందుకంటే, తక్కువగా వేస్తే అది ఆ బ్లేడ్స్‌లోనే చాలా వరకూ ఇరుక్కుంటుంది. త్వరగా బయటికి రాదు వాసన కూడా వస్తుంది. కాబట్టి, అలాంటి మసాలాలని చేత్తో నూరుకుంటేనే మంచిది. ఫ్రోజెన్.. చాలా మంది ఫ్రోజెన్ ఫుడ్స్ వాడుతుంటారరు. వీటిని అప్పుడే ఫ్రిజ్ నుంచి తీసి మిక్సీలో వేస్తే అది మెత్తగా అవ్వడానికి చాలా టైమ్ తీసుకుంటుంది. దీని వల్ల బ్లేడ్స్ త్వరగా అరిగిపోతాయి. అందుకే అలా చేయొద్దు కూరగాయలు... చాలా మంది కూరగాయల్ని కూడా చాపర్‌లో వేస్తుంటారు. కానీ, అలా వేయకపోవడమే మంచిది. ఇవన్నీ ఒకే పరిమాణంలో ఉండాలని అనుకుంటారు కానీ, అందులో ఏమైనా చిన్న చిన్న బ్యాక్టీరియా, పురుగులు వంటివాటిని గమనించలేం. అదే విధంగా, అన్నింటిని చాపర్‌లోనే వేయకూడదని గుర్తుపెట్టుకోండి.



## త్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ అని ఒక్కొక్కరు ఒక్కో గదిలో.. తెల్లారి చూస్తే..

**శ్రీసత్యసాయి:** రోజులు మారిపోయాయి.. దొంగలు రెచ్చిపోతున్నారు.. చట్టాలంటే భయం తగ్గిపోవటమో, లేకపోతే మనల్ని ఎవ్వరా ఆపేది అనే ధైర్యమో తెలియదు కానీ.. దొంగలు మరీ బరి తెగిస్తున్నారు. ఒకప్పుడు దారి కాచి చోరీ చేసే దొంగలు.. ఇప్పుడు మరీ రెచ్చిపోతున్నారు. ఏకంగా ఇళ్లల్లోకి ప్రవేశించి.. అందినకాడికి దోచుకెళ్తున్నారు. అయితే ఇంటి సభ్యులు తాళం వేసి వేరే ఊరికి వెళ్లినప్పుడో లేదా ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న సమయంలోనో.. ఇళ్లల్లోకి దూరి చోరీ చేయడం ఓకే. కానీ ఇంట్లో అందరూ ఉండగానే.. ఇంట్లోకి దూరి దొంగతనం చేశారంటే.. ఏం గుండెరా అది అనుకోక తప్పదు. ఇలాంటి ఘటన శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో చోటుచేసుకుంది. ఈ దొంగతనం గురించి తెలిసిన స్థానికులు.. ఇదేం విచిత్రం అని చెవులు కొరుక్కుంటున్నారు.

ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కదిరి పట్టణంలోని జడ్జి బంగ్లా వెనుక ఉన్న వైశ్యకాలనీలో వెంకటశివ, కవిత దంపతులు నివసిస్తున్నారు. ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరు ఉంటున్న ఇళ్లు త్రిబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్.. ఆదివారం రాత్రి కుటుంబసభ్యులు వేర్వేరుగా.. వేరే గదుల్లో పడుకున్నారు. రెండు బెడ్రూమ్‌లలో కుటుంబసభ్యులు పడుకోగా.. ఒక బెడ్‌రూమ్‌లో మాత్రం ఎవరూ పడుకోలేదు. ఇక అదే రూమ్‌లో బీరువా ఉంది. ఆ బీరువాలో నగదు, నగలు గట్రా ఉన్నాయి. ఈ విషయం ఎలా తెలిసిందో కానీ దొంగలు పసిగట్టారు. ఆదివారం రాత్రి ఆ ఇంట్లో చోరీకి ప్లాన్ చేశారు.

ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత బెడ్ రూమ్ కిటికీకి ఉన్న కడ్డీలు కోసి దొంగలు లోపలికి ప్రవేశించారు. ఆ గదిలో శబ్దాలు బయటకు వినపడకుండా.. అలాగే వెంటనే ఎవరూ రాకుండా బెడ్ రూమ్ గడిపెట్టేశారు. ఆ తర్వాత బీరువాలోని 10 తులాల బంగారు నగలు, 4 కిలోల వెండి, రూ.లక్ష నగదు తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. సోమవారం తెల్లవారుజామున వెంకటశివ దంపతుల కుమార్తె.. బెడ్ రూమ్ లోపలి నుంచి గడియ వేసి ఉండటం గమనించింది. ఎవరూ లేని బెడ్రూమ్‌లో.. లోపలి నుంచి ఎవరు గడియ పెట్టారనే అనుమానంతో వెంటనే తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పింది.

అడుగు పెట్టనివ్వడం లేదు.. గొడ్డలితో నరకడానికి వస్తున్నారు.. న్యాయం చేయాలంటూ జవాన్ ఆవేదన

దీంతో వెంకటశివ దంపతులు బెడ్రూమ్ బయటి నుంచి పరిశీలిస్తే.. అసలు విషయం బోధపడింది. బెడ్ రూమ్ కిటికీ కడ్డీలు తొలగించి దొంగలు లోపలికి ప్రవేశించిన విషయాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు అనంతరం దొంగలను గుర్తించేందుకు క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ రంగంలోకి దించారు. చోరీ జరిగిన గదిని పరిశీలించి ఆధారాలను సేకరించారు. ఇంటి యజమాని వెంకటశివ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. అయితే ఇంట్లో అందరూ నిద్రపోతుండగానే.. చోరీ జరిగిందన్న వార్త స్థానికంగా చర్చనీయాంశమైంది.

## మామిడి రైతులకు ఊరట..

**ఆంధ్రప్రదేశ్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మామిడి రైతులకు ఊరట కలిగించేలా మద్దతు ధరపై నిర్ణయం తీసుకున్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతుల ఇబ్బందులపై పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్.. చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన చంద్రబాబు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కంపెనీల యజమానులు, మామిడి వ్యాపారులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్ కుమార్.. కిలో మామిడిని రూ.12 చొప్పున కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.

మామిడి రైతులకు ఊరట కలిగించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కిలో మామిడికి రూ.12 చెల్లించాలని మామిడిని కొనుగోలు చేసే కంపెనీల యాజమాన్యాలను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. చిత్తూరు జిల్లాలో ఎక్కువగా మామిడి సాగవుతోంది. అయితే మామిడి పంటను కొనుగోలు చేసేందుకు కంపెనీల యాజమాన్యాలు ముందుకు రావడం లేదు. వ్యాపారులకు అమ్ముదామంటే రేటు మరీ తగ్గించి అడుగుతున్నారు. దీంతో చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోత కోయకుండా చెట్ల మీదే ఉంచితే.. మామిడి కాయలు రాలిపోతున్నాయి. కోత కోస్తే మార్కెట్ లేని పరిస్థితి. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో వచ్చిన ధరకే మామిడిని అమ్ముకుంటున్నారు.

మామిడికి మద్దతు ధర లేక.. పెట్టిన పెట్టుబడి కూడా రాక.. రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలంటూ మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మామిడి రైతుల సమస్యలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన చంద్రబాబు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్.. చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే మురళీ మోహన్, రైతు సంఘాలు, కంపెనీల యజమానులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. కిలో మామిడి రూ.12 చొప్పున కొనుగోలు చేయాలని పల్ప్ కంపెనీల యజమానులను ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, చిత్తూరు, విశాఖపట్నం జిల్లాలో మామిడి పంటను ఎక్కువగా సాగుచేస్తుంటారు. ఏటా 43.50 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి పండ్లు మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతుంటాయని అంచనా. ఆంధ్రప్రదేశ్ నుంచి మామిడి వేరే రాష్ట్రాలకు, విదేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు.

చిత్తూరు జిల్లా విషయానికి వస్తే మామిడి విస్తీర్ణం, ఉత్పత్తి రెండింటిలోనూ ముందంజలో ఉంది. మరే ప్రాంతంలో లేని విధంగా చిత్తూరు జిల్లా రైతులు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో సుమారు రెండున్నర లక్షల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. తోతాపురి మామిడి పంటను అధిక విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. బేనీషా, నీలం, చెరకు రసాలు వంటి రకాలు కూడా సాగుచేస్తున్నారు. మామిడి పండ్ల రసం తయారు చేసే కంపెనీలు ఎక్కువగా తోతాపురి రకాన్ని కొనుగోలు చేస్తుంటాయి. అయితే ఈసారి కిలో మామిడి రూ.5 నుంచి రూ.7 వరకూ అడుగుతూ ఉండటంతో రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే మామిడి మద్దతు ధరపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# కొత్తగా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్..

### ఏకంగా 5వేల ఎకరాల్లో, ఆ ప్రాంతానికి మహర్దశ

**ఆంధ్రప్రదేశ్:** రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా రెండో దశలో 40 వేల ఎకరాల భూమిని సేకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయనున్నారు. విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు అవసరం అవుతాయని మంత్రి నారాయణ తెలిపారు. భూ సమీకరణ ద్వారా సేకరించిన భూములను రైతులకు మూడేళ్లలో అభివృద్ధి చేసి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతికి సంబంధించి భవిష్యత్ ప్రణాళికల్ని సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో అమరావతి అభివృద్ధి కోసం రెండో దశలో 40 నుంచి 45 వేల వేల ఎకరాల భూమిని సేకరించాలని భావిస్తోంది. ఈ భూమిని భూ సమీకరణ ద్వారా, భూసేకరణ ద్వారా తీసుకోవాలా అనే అంశాలను పరిశీస్తోంది. స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ప్రజల అభిప్రాయాలను తీసుకునే పనిలో ఉన్నారు. అమరావతిలో కూడా శంషాబాద్ ఎయిర్‌పోర్టు తరహాలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని గుర్తు చేస్తున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీఏ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు అవసరం అవుతాయన్నారు మంత్రి నారాయణ. పెట్టుబడిదారులు అమరావతికి రావాలంటే 5 వేల ఎకరాలతో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ఉండాలన్నారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ కోసం 2,500 ఎకరాలు, స్పోర్ట్స్ సిటీ కోసం మరో 2,500 ఎకరాలు కేటాయించాల్సి ఉంటుందన్నారు.

హైదరాబాద్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు విషయంలో చంద్రబాబు అప్పట్లో దూరదృష్టితో ఆలోచించారన్నారు. అప్పట్లోనే శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అన్ని వేల ఎకరాలు ఎందుకు? బేగంపేటలో ఉన్న ఎయిర్‌పోర్టు చాలదా? అని విమర్శించారన్నారు. అప్పుడు కనుక శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మించకపోతే ఇప్పుడు అక్కడికి వస్తున్న విమానాల్లో పది శాతం కూడా బేగంపేటలో దిగలేవని వ్యాఖ్యానించారు. పెట్టుబడులు రావాలంటే అంతర్జాతీయ విమానాలు దిగేలా ఉండాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందుకే అమరావతిలోనూ 5,000 ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాలని ప్లాన్ చేశామన్నారు.

అమరావతి పరిధిలో ఉన్న పెదకూరపాడు నియోజకవర్గంలో 26,000 ఎకరాలు, తాడికొండ నియోజకవర్గంలోని మూడు గ్రామాల్లో 12,000 ఎకరాలు భూసమీకరణ ద్వారా సేకరించడానికి రైతులు ముందుకు వచ్చారన్నారు మంత్రి నారాయణ. ఈ రెండో విడతలో రాజధాని కోసం భూములు ఇచ్చే రైతులకు మూడేళ్లల్లో మూడేళ్లలో అభివృద్ధి చేసిన స్థలాలు అప్పగిస్తామన్నారు. రాజధానిలో విద్య, వైద్య సంస్థలకు భూముల రిజిస్ట్రేషన్ ఫీజులో మినహాయింపు ఇవ్వాలని సీఆర్డీఏ నిర్ణయించినట్లు తెలిపారు. వచ్చే మూడేళ్లలో అమరావతి కోర్ క్యాపిటల్ ప్రాంతంలోని అన్ని నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. కోర్ క్యాపిటల్ ఏరియాలో రూ.3,673 కోట్ల అంచనా వ్యయంతో ఐదు అడ్మినిస్ట్రేటివ్ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసిన విషయాన్ని తెలిపారు.

అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తే ఏడాదికి రెండు మూడు పెద్ద ఈవెంట్లు జరుగుతాయని.. ఇలా దేశ, విదేశాల నుంచి క్రీడాకారులు, ఫ్యాన్స్ వస్తారన్నారు.. అప్పుడు హెూటల్స్ కూడా ఏర్పాటవుతాయన్నారు. ఇలా ప్రభుత్వానికి %+ూ% పెరుగుతుంది అన్నారు. భూసమీకరణలో తీసుకున్న భూమిలో రైతులకు స్థలాలు కేటాయించగా సీఆర్డీఏకు 25 శాతమే మిగులుతాయన్నారు. ఎయిర్‌పోర్ట్, స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీలకు 10,000 ఎకరాలు కావాలంటే 40,000 ఎకరాలు సేకరించాల్సిన అవసరం ఉందన్నారు.




# ఆక్వా పార్కు.. అక్కడే, ఫిక్స్..



**ఆంధ్రప్రదేశ్:** త్వరలోనే ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు ఏర్పాటు కానుంది. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలంలోని దిండి వద్ద సమీకృత ఆక్వా పార్కు ఏర్పాటు కోసం వడివడిగా అడుగులు పడుతున్నాయి. దిండి ఆక్వా పార్కు కోసం మత్స్యశాఖ అధికారులు టెండర్లు పిలిచారు. టెండర్లు ఖరారైన తర్వాత.. సీఎం చేతుల మీదుగా దిండి ఆక్వా పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేయించాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. రూ.88 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనుండగా.. కేంద్రం 60 శాతం వాటా నిధులు కేటాయించనుంది.

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఇండస్ట్రియల్ పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కులు, టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు ద్వారా పెట్టుబడులను ఆకర్షించి.. స్థానిక యువతకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే పలు జిల్లాలలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు బాపట్ల జిల్లాలోనూ ఆక్వా పార్కు ఏర్పాటు చేయనున్నారు. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలంలో ఆక్వాపార్కు ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. నిజాంపట్నంలోని దిండి వద్ద ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు నిర్మించనున్నారు. ఆక్వా పార్కు నిర్మాణ పనుల కోసం టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు ఖరారు కాగానే.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం చేపట్టనున్నారు.

మరోవైపు దిండి ఆక్వా పార్కు నిర్మాణం కోసం గతంలో సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది రాష్ట్ర ప్రభుత్వం. ఈ డీపీఆర్‌కు ఆమోదం తెలిపిన కేంద్రం.. 2020లోనే అనుమతులు కూడా మంజూరు చేసింది. దిండి సమీకృత ఆక్వా పార్కు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను కేటాయించనుంది. మిగతా 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. అయితే భూకేటాయింపులో ఆలస్యం జరగ్గా.. చివరకు 2022లో దిండి వద్ద 280 ఎకరాలు ఆక్వాపార్కు కోసం కేటాయించారు. 2023 మే నెలలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. వర్చువల్‌గా శంకుస్థాపన కూడా చేశారు. దిండి ఆక్వా పార్కు నిర్మాణం కోసం రెండు దశల్లో రూ.188 కోట్లు ఖర్చు చేయాలని అంచనాలు రూపొందించారు. మొదటి దశలో పీతలు, సముద్ర నాచు, రొయ్యల హేచరీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, నీటిశుద్ధి ప్లాంట్లు నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి వాటా నిధులు విడుదల కాకపోవటంతో ప్రాజెక్టులో జాప్యం జరిగింది.

అయితే 2024లో రాష్ట్రంలో టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి రావటంతో దిండి ఆక్వా పార్కు నిర్మాణంపై ఫోకస్ పెట్టింది. 192 ఎకరాలను ఆక్వా పార్కు కోసం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆక్వా పార్కు నిర్మాణానికి నిధుల కేటాయించాలని కేంద్రాన్ని కోరగా.. మరోసారి ప్రాజెక్టు అంచనా వ్యయం రూపొందించి పంపాలని కేంద్రం జవాబిచ్చింది. అలాగే దిండి ఆక్వా పార్కు ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.88.08 కోట్లకే పరిమితం చేయాలని పేర్కొంది. దీంతో రూ.88 కోట్లతో డీపీఆర్ తయారు చేసి కేంద్రానికి పంపగా.. కేంద్రం నుంచి అనుమతులు మంజూరు అయ్యాయి. దిండి ఆక్వా పార్కు నిర్మాణం కోసం కేంద్రం రూ.52.85 కోట్లు , రాష్ట్ర ప్రభుత్వం రూ.35.23 కోట్లు ఖర్చు చేయనున్నాయి.

**ఆక్వా పార్కుతో ఏంటి లాభం?**

మరోవైపు ఆక్వారంగ ప్రగతికి ఆక్వా పార్కు ప్రాజెక్టు కీలకం. రొయ్యలు, పీతల హేచరీలు ఈ ప్రాంతంలో లేకపోవటంతో రైతులు.. పొరుగున ఉన్న రాష్ట్రాల నుంచి చేప పిల్లలను తెప్పిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్కు అందుబాటులోకి వస్తే ఈ ఇబ్బందులు తప్పనున్నాయి. అలాగే ఆక్వా ఎగుమతులు పెరగడం కూడా ఆదాయం కూడా పెరుగుతుందని అధికారులు చెప్తున్నారు. వీలైనంత త్వరగా టెండర్లు ఖరారు చేసి.. పనులు ప్రారంభించే ఆలోచనలో ఉన్నారు.

## అర్ధరాత్రి షాపులోకి దూరి.. కాళ్లూచేతులు కట్టేసి..

**తిరుపతి:** తిరుపతిలోని మారుతి షోరూంలో భారీ చోరీ జరిగింది. మారుతి షోరూంలో అర్ధరాత్రి దోపిడీ జరిగింది. మాస్కులు ధరించిన నలుగురు వ్యక్తులు షోరూంలోకి ప్రవేశించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న సేల్స్ ఎగ్జిక్యూటివ్ బాలాజీ బట్టలు విప్పించి.. చేతులు, కాళ్లు కట్టేసి కదలకుండా చేశారు. దుండగులు మేనేజర్ క్యాబిన్‌లోకి ప్రవేశించి.. అందులో ఉన్న రూ. 7 లక్షల నగదు ఉన్న లాకర్‌ను ఎత్తుకెళ్లారు. సమీపంలోని రైల్వే ట్రాక్‌పై లాకర్‌ను పగులగొట్టి, నగదుతో ఉడాయించారు. దొంగలు వెళ్లిపోయిన తర్వాత కట్లు విప్పుకున్న బాలాజీ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి, క్లూస్ టీమ్‌ను ఘటనా స్థలానికి రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. దోపిడీకి సంబంధించిన వీడియోలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

## జేసీబీలతో అర్ధరాత్రి సినిమా హాల్‌పై దాడి

అదొక సినిమా థియేటర్. విజయవాడ నడిబొడ్డులో ఉంది. అలాంటిది.. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక జేసీబీని తీసుకొచ్చి ఆ థియేటర్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటన జరిగి రెండు రోజులు కావస్తున్నా.. ఈ దాడి ఎవరు చేశారో ఇంకా తెలియలేదు. నిందితులు తెలివిగా థియేటర్ వద్ద సీసీ కెమెరా కనెక్షన్లు, కరెంట్ లైన్ పీకేసి ఈ దాడి చేశారని థియేటర్ యజమాని అడుసుమిల్లి శ్రీరామ్ చెబుతున్నారు.

విజయవాడ పోలీస్ కమిషనర్‌కు బాధితుడు అడుసుమిల్లి శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. త్రీ టౌన్ గవర్నరుపేటలో అన్నపూర్ణ శకుంతల థియేటర్‌ను నడుపుతున్నారు. అయితే, గత నెల 31వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు ఒంటి గంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు థియేటర్‌లోకి ప్రవేశించారు. తమ వెంట జేసీబీని కూడా తెచ్చుకున్నారు. థియేటర్‌లో నిద్రిస్తున్న వర్కర్లను బెదిరించి.. వారి వద్ద నుంచి ఫోన్లు లాక్కొని వారిని బంధించారు.

అనంతరం జేసీబీతో థియేటర్‌కు సంబంధించిన టికెట్ కౌంటర్, క్యాంటీన్, ఆఫీస్ రూమ్, థియేటర్ మెట్లు, వాష్ రూమ్స్ ధ్వంసం చేసి పరారయ్యారు. థియేటర్‌కు ఉన్న కరెంట్ లైన్, సీసీ కెమెరాలు పీకేసి ఈ పనిచేశారని బాధితుడు పేర్కొన్నారు.

# సినిమాల్లోనూ నటించాడు, ఎవరీ డేవిడోవిచ్!

**శ్రీసత్యసాయి:** జిల్లాలో ఒక విదేశీయుడు అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. బెలారస్‌కు చెందిన డేవిడోవిచ్ అనే వ్యక్తి పర్యాటక వీసాపై వచ్చి పుట్టపర్తిలో నివాసం ఉంటున్నాడు. అతను ఒక అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తులో నివసిస్తుండగా అనుమానాస్పదంగా మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అసలు అతడు ప్రమాదవశాత్తు పడ్డాడా, లేక ఎవరైనా తోసేశారా అనే కోణంలో విచారణ జరుగుతోంది. ఈ మిస్టరీ వీడుతుందా?

శ్రీసత్యసాయి జిల్లాలో విదేశీయుడు అనుమానాస్పద మృతి కలకలం రేపింది. డేవిడోవిచ్‌ది ఈస్ట్ యూరప్‌లోని బెలారస్ కాగా.. మూడు నెలలు కిందట విజిటింగ్ (పర్యాటక) వీసాపై భారత్‌కు చేరుకుని శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి వచ్చాడు. స్థానికంగా ఉన్న గోపురం మూడో క్రాస్ సమీపంలోని ప్రియాంక అపార్ట్‌మెంట్ ఐదో ఫ్లోర్‌లో నివాసం ఉంటున్నాడు. డేవిడోవిచ్ కొన్ని సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించాడు.. పుట్టపర్తితో పాటు హైదరాబాద్, చెన్నైలో కూడా నివాసం ఉన్నాడు. గతవారం పుట్టపర్తిలో ఉన్న డేవిడోవిచ్.. ఆదివారం రాత్రి మద్యం మత్తులో కనిపించాడు. డేవిడోవిచ్ ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో తన మొబైల్ కనిపించడం లేదని స్థానికంగా పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. ఆయన మద్యం మత్తులో ఉండటంతో.. సోమవారం ఉదయం ఫిర్యాదును పరిశీలిస్తామని పోలీసులు చెప్పారు. దీంతో పోలీస్ స్టేషన్ నుంచి బయల్దేరి తిరిగి తన గదికి వచ్చాడు. అయితే ఏం జరిగిందో ఏమో సోమవారం ఉదయం ఆయన నివాసం ఉంటున్న భవనం చనిపోయి ఉన్నాడు.. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై అనుమానాస్పద మరణం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డేవిడోవిచ్ ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఐదో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు కోల్పోయాడా?.. ఎవరైనా అతడ్ని పై నుంచి కిందకు తోసేశారా?.. అతడ్ని చంపి అక్కడ పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**యాడికిలో దాడి కలకలం**

అనంతపురం జిల్లా యాడికి మండలం బోయరెడ్డిపల్లిలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ముగ్గురికి గాయాలయ్యాయి. టీడీపీ చెందిన హరికృష్ణ, వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు మారుతీకుమార్ మధ్య భూమి సమస్య, పాత కక్షల కారణంగా గొడవ జరిగిందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. గ్రామంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు మధ్య బైక్ విషయంలో వాగ్వాదం మొదలైంది. పాత కక్షలను మనసులో పెట్టుకొని ఇరువురు ఘర్షణ పడ్డారని పోలీసులు చెబుతున్నారు. ఈ దాడిలో నాలుగు బైక్‌లు కూడా ధ్వంసం అయ్యాయి. లక్ష్మీదేవి, రామకృష్ణలకు గాయాలయ్యాయి.

## ప్రధానోపాధ్యాయురాలిపై అసభ్యకర మెసేజ్‌లు..

**ఏలూరు:** జిల్లాలోని ఓ స్కూల్లో ప్రధానోపాధ్యాయిని, టీచర్ మధ్య గొడవ జరిగింది. టీచర్, హెడ్మాస్టర్‌పై అసభ్యకర మెసేజ్‌లు పంపింది. దీంతో హెడ్మాస్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో టీచర్ చేసిన పని బయటపడింది. స్కూల్లో మొబైల్ వాడొద్దని చెప్పినందుకే ఇలా చేసిందని తెలిసింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. అసలు ఈ గొడవకు కారణం ఏంటి? దీని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా?

ఓ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయిని, మరో మహిళా టీచర్ మధ్య వార్ నడిచింది. ఈ క్రమంలో ఆ టీచర్ స్కూల్ ప్రధానోపాధ్యాయినిపై అసభ్యకరమైన మెసేజ్‌లతో వేధించారు.. తప్పుడు ప్రచారం చేశారు. ఈ క్రమంలో బాధితురాలు పోలీసుల్ని ఆశ్రయించడంతో ఈ స్టోరీ మొత్తం బయటపడింది.. దర్యాప్తులో ఆ టీచర్ గురించి సంచలన విషయాలు బయటపడ్డాయి. ఏలూరు జిల్లాలోని ఓ జెడ్పీ ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని పనిచేస్తున్నారు. ఆ స్కూల్‌లో టీచర్లు అకారణంగా సెలవులు పెట్టొద్దని.. స్కూల్‌లో, క్లాస్ రూమ్‌లలో ఉన్న సమయంలో మొబైల్స్ వినియోగించొద్దని ఆదేశించారు.


ఈ క్రమంలో అదే స్కూల్‌లో పనిచేస్తున్న లేడీ టీచర్ ప్రధానోపాధ్యాయినిపై కక్ష పెంచుకున్నారు. ఆమెను ఎలాగైనా అల్లరి చేయాలని ప్లాన్ చేశారు. వెంటనే తన ఇంట్లో పనులు చేసే మనిషి పేరుతో ఓ సిమ్ కొనుగోలు చేశారు.. స్కూల్ ప్రధానోపాధ్యాయినిపై బంధువులు, కుటుంబ సభ్యులతో పాటుగా తోటి టీచర్లకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపారు. ఈ మెసేజ్‌ల విషయం తెలియడంతో ప్రధానోపాధ్యాయిని మనస్తాపానికి గురయ్యారు.. తనపై తప్పుడు ప్రచారం జరగడంతో ఆమె బాధపడ్డారు. వెంటనే ఏలూరు సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌లో ఈ మెసేజ్‌ల అంశంపై ఫిర్యాదు చేశారు.. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు.. కేసును మహిళా పోలీసుస్టేషన్‌కు పంపారు.

వాట్సాప్ మెసేజ్‌లు పెడుతున్న వ్యక్తి ఎవరో కనుగొనేందుకు స్కూల్‌కు వెళ్లి ఆరా తీశారు. చివరకు అదే స్కూల్లో పనిచేస్తున్న మహిళా టీచర్ ఈ నేరం చేసినట్లు గుర్తించారు. ఆమెపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అలాగే ఆ మహిళా టీచర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీఈవోకు పోలీసులు లేఖ రాశారు. అలాగే స్కూల్‌లో లేడీ టీచర్‌కు మరికొందరు సహకరించినట్లు తెలిసిందని.. విచారణ జరిపిన తర్వాత వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు పోలీసులు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.. ఇద్దరు ప్రభుత్వ టీచర్ల మధ్య మొదలైన చిన్న వార్ ఇలా కేసుల వరకు వెళ్లింది. ఒక ప్రభుత్వ స్కూల్‌లో ఇలాంటి ఘటన జరగడం చర్చనీయాంశం అయ్యింది.

## కర్ణాటక భక్తురాలి పెద్దమనసు.. భారీ విరాళం..

**తిరుమల:** తిరుపతి దేవస్థానానికి మరోసారి భారీ విరాళం అందింది. టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.54 లక్షలు విరాళంగా అందింది. కర్ణాటకలోని మంగళూరు ప్రాంతానికి చెందిన విద్యా రవిచంద్రన్ అనే భక్తురాలు.. టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు 54 లక్షల రూపాయలు విరాళంగా అందించారు. విరాళానికి సంబంధించిన డీడీని టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను వెంకయ్య చౌదరి అభినందించారు. మరోవైపు తిరుమల తిరుపతి దేవస్థానం ఎనో సేవా కార్యక్రమాలను చేపడుతోంది. అందులో ఎస్వీ ప్రాణదాన ట్రస్టు ఒకటి. ఎస్వీ ప్రాణదాన ట్రస్టు ద్వారా గుండె, మూత్రపిండాలు, మెదడు, క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారు. శ్రీవారి భక్తులు అందించే విరాళాల ద్వారా ఎస్వీ ప్రాణదాన ట్రస్టును నిర్వహిస్తున్నారు.

ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ ద్వారా ప్రాణాంతక వ్యాధులతో బాధపడే వారికి ఉచిత వైద్యం, చికిత్సకు అవసరమైన మందులు, ఇతర వైద్య సదుపాయాలను అందిస్తారు. ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు విరాళాలు అందించడం ద్వారా పేద రోగులకు ఉచిత వైద్య సేవలను అందించడానికి సహాయపడవచ్చు. ఈ నేపథ్యంలో తిరుమలకు వచ్చే ప్రముఖులు, భక్తులు.. ఈ ట్రస్టుకు విరాళాలు అందిస్తూ.. మానవసేవే మాధవసేవగా భావిస్తూ తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే కర్ణాటక భక్తురాలు విద్యా రవిచంద్రన్ టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు భారీ విరాళం అందించారు.




అప్పలాయగుంట ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు

మరోవైపు అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో జూన్ 6వ తేదీ నుంచి జూన్ 15 వరకూ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. జూన్ ఆరో తేదీ సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు.

**అప్పలాయగుంట ఆలయం చరిత్ర..**

శ్రీవారు నారాయణవనంలో ఆకాశరాజు కుమార్తె పద్మావతీ దేవిని వివాహం చేసుకుని తిరుమలకు వెళు న్నారు. ఈ సందర్భంగా వకుళామాత ఆశ్రమానికి వెళ్లే మార్గమధ్యంలో సిద్దేశ్వరస్వామి తపస్సును మెచ్చి ఇక్కడ ఆగారు. సిద్ధేశ్వరస్వామి కోరిక మేరకు అభయ హస్తాలతో వెంకటేశ్వరస్వామి ఇక్కడ వెలిసినట్లు స్థల పురాణం. ఇక్కడ ఏటా వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహనసేవలు జరుగనున్నాయి.

# రేషన్ కార్డు లబ్ధిదారులకు షాక్..

**తెలంగాణ ప్రభుత్వం నకిలీ రేషన్ కార్డుదారులకు గట్టి షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. గత 6 నెలలుగా రేషన్ సరుకులు తీసుకోని వారి కార్డులను పరిశీలించి తొలగించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. రాష్ట్రంలో 6 నెలల కంటే ఎక్కువ కాలం రేషన్ తీసుకోని కార్డుదారులు 1.59 లక్షల మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు.**

తెలంగాణ: ప్రభుత్వం నకిలీ రేషన్ కార్డుదారులపై కొరడా ఝుళిపిస్తోంది. గత 6 నెలలుగా రేషన్ తీసుకోని వారి కార్డులు క్యాన్సిల్ చేయాలని యోచిస్తోంది. ఇప్పటికే అలాంటి కార్డులు 1.59 లక్షలు ఉండగా.. వారిలో 30 శాతం అనర్హులుగా తేలారు. కేంద్ర ఆదేశాలతో వీరి కార్డులు రద్దు కానున్నాయి. ఈ చర్యతో రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. ఇక ఇప్పటికే 2 లక్షల కొత్త కార్డులు మంజూరు కాగా.. అనర్హుల తొలగింపు తర్వాత అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు సర్కార్ చర్యలు చేపట్టింది.

తెలంగాణ ప్రభుత్వం నకిలీ రేషన్ కార్డుదారులకు గట్టి షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. గత 6 నెలలుగా రేషన్ సరుకులు తీసుకోని వారి కార్డులను పరిశీలించి తొలగించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్య చేపట్టింది. రాష్ట్రంలో 6 నెలల కంటే ఎక్కువ కాలం రేషన్ తీసుకోని కార్డుదారులు 1.59 లక్షల మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



వీటిపై విచారణ జరిపి.. అనర్హులు అని తేలితే కార్డులు రద్దు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటికే 80 శాతం కార్డులపై విచారణ పూర్తవ్వగా.. వాటిలో 30 శాతం అనర్హులే అని తేలినట్లు సమాచారం. వీరిలో కొందరు చాలా నెలలుగా రేషన్ తీసుకోనివారు ఉండగా.. మరికొందరు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించినవారు ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈ కార్డులన్నీ రద్దయ్యే అవకాశం ఉంది. ఈ చర్యల ద్వారా రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెరిగి, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఇక రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రస్తుతం ఒకేసారి 3 నెలల రేషన్ సరుకులు పంపిణీ చేస్తోంది. ఈ కారణంగా రేషన్ షాపుల వద్ద భారీ క్యూలు ఏర్పడుతున్నాయి. 3 నెలల సరుకులు ఒకేసారి తీసుకునే ప్రక్రియలో 3 సార్లు బయోమెట్రిక్ తీసుకోవాల్సి రావడం, ఈ-పాస్ సాఫ్ట్‌వేర్‌లో తీవ్ర సమస్యలు ఎదురవుతుండటంతో లబ్ధిదారులు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఇక తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే మీసేవా కేంద్రాల ద్వారా అప్లయ్ చేసుకున్న లబ్ధిదారులకు 2 లక్షల కార్డులు మంజూరు చేశారు. అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అనర్హుల కార్డుల తొలగింపు పూర్తయిన తర్వాత.. కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించనుంది. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరింతరాయంగా కొనసాగుతుందని.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు మంజూరు చేస్తామని ఇది వరకే మంత్రులు స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

# ప్రజల వద్దకే రెవెన్యూ, భూ సమస్యలకు చెక్



తెలంగాణ: తెలంగాణ రైతులకు శుభవార్త. నూతన రెవెన్యూ చట్టం 'భూభారతి' అమలులో భాగంగా నేటి నుంచి ఈనెల 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. 'ప్రజల వద్దకే రెవెన్యూ' నినాదంతో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌లో 55 వేల దరఖాస్తులు రాగా.. 60 శాతం పరిష్కరించబడ్డాయి. త్వరలో 6,000 మంది సర్వేయర్ల నియామకం, డాక్యుమెంట్లతో సర్వే మ్యాపుల అనుసంధానం వంటి చర్యలతో రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకత తీసుకురానున్నారు.

తెలంగాణ రైతులకు బిగ్ రిలీఫ్. ఇక భూ సమస్యలు ఉండవ్. తెలంగాణ రాష్ట్రంలో నూతన రెవెన్యూ చట్టం 'భూభారతి' అమల్లో భాగంగా నేటి నుంచి (జూన్ 3) జూన్ 20 వరకు రాష్ట్రమంతటా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. 'ప్రజల వద్దకే రెవెన్యూ' నినాదంతో రైతుల భూ సమస్యలను పరిష్కరించడం ఈ సదస్సుల ప్రధాన లక్ష్యమన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సరిదిద్దడమే ఈ చట్టం ముఖ్య ఉద్దేశం అని మంత్రి వెల్లడించారు.

ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూభారతిని ప్రారంభించారు. మొదట జిల్లాకు ఒక మండలంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈ చట్టాన్ని అమలు చేశారు. అయితే ఈ పైలట్ ప్రాజెక్టులో 55 వేల దరఖాస్తులు వచ్చాయని.. ఇది క్షేత్రస్థాయిలో సమస్యల తీవ్రతను తెలియజేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తుల్లో 60 శాతం సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సదస్సుల్లో భాగంగా ప్రతి రెవెన్యూ గ్రామానికి తహసీల్దార్‌తో కూడిన బృందం వెళ్లి, భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి, పరిష్కరిస్తుందన్నారు. ముఖ్యంగా సాదాబైనామాలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా ఉన్నాయని అధికారులు గుర్తించినట్లు చెప్పారు. కలెక్టర్లు ఈ సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

భూముల రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్లతో పాటు సర్వే మ్యాపును జతపరిచే విధానాన్ని కొత్త చట్టంలో భాగంగా తీసుకొచ్చినట్లు మంత్రి పొంగులేటి వెల్లడించారు. దీనిలో భాగంగా కొలతలు, భూదస్త్రాల నిర్వహణ శాఖను బలోపేతం చేయడానికి వచ్చే రెండు నెలల్లో మొదటి దశలో 6 వేల మంది సర్వేయర్లను నియమిస్తామన్నారు. ఇటీవల ఎంపిక చేసిన జీపీఓలకు (గ్రామ పంచాయతీ అధికారులు) త్వరలో నియామక పత్రాలను అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ చర్యలన్నీ రెవెన్యూ వ్యవస్థలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంచడానికి దోహదపడతాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలోని ధరణి పోర్టల్ ద్వారా అనేక అక్రమాలు జరిగాయని.. భూభారతి చట్టంతో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని పొంగులేటి వెల్లడించారు.

# అందరి బాగోతాలు బయటపెడతా



తెలంగాణ: బీజేపీలో కలకలం రేగింది. సొంత పార్టీ నేతలపై రాజాసింగ్ సంచలన ఆరోపణలు చేశారు. దమ్ముంటే తనను సస్పెండ్ చేయాలని సవాల్ విసిరారు. తనపై చర్యలు తీసుకుంటే.. బీజేపీలో ఇంటి దొంగల బాగోతం బయటపెడతానని హెచ్చరించారు. కొందరు నేతలు బీఆర్ఎస్ నాయకులకు బీజేపీని తాకట్టు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని రాజాసింగ్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఆ వివరాలు మీకోసం..

తెలంగాణ బీజేపీ నాయకుడు, ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడమే కాక.. నోటీసులు ఇచ్చేందుకు బీజేపీ అధిష్టానం సిద్ధమవుతోందంటూ జోరుగా ప్రచారం జరుగుతున్న సమయంలో.. రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇంటి దొంగలంతా ఒక్కటయ్యారని.. తనకు నోటీసులు ఇవ్వడం కాదు.. దమ్ముంటే సస్పెండ్ చేయాలని రాజా సింగ్ సవాల్ చేయడం సంచలనంగా మారింది.

రాజాసింగ్.. ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలకు మద్దతిస్తూ కామెంట్స్ చేయడంతో ఆయనను సస్పెండ్ చేస్తారనే ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలో రాజాసింగ్ మాట్లాడుతూ.. బీజేపీలో దొంగలంతా ఒకటయ్యారని ఆరోపించారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే అందరి బాగోతాలు బయటపెడతాంటూ హెచ్చరించారు. ప్రస్తుతం రాజాసింగ్ వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారింది.

ఈ ప్రచారంపై రాజాసింగ్ స్పందిస్తూ.. తనకు నోటీసులు ఇవ్వడం కాదు.. దమ్ముంటే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని సవాల్ చేశారు. ఒకవేళ తనను గనక పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే.. అప్పుడు పార్టీకి ఎవరు నష్టం చేకూరుస్తున్నారో బయటపెడతానంటూ రాజా సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాక..ఇంటి దొంగలంతా ఒకటయ్యారని.. వారంతా కలిసి.. బీజేపీని బీఆర్ఎస్ నాయకులకు తాకట్టు పెడుతున్నారంటూ రాజా సింగ్ తీవ్ర విమర్శలు చేశారు. కొంచెం ఎక్కువ ప్యాకేజ్ ఇస్తే బీజేపీ పార్టీని.. బీఆర్ఎస్‌కు తాకట్టు పెడతారని రాజాసింగ్ చెప్పుకొచ్చారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే.. ఇలాంటి వారి బాగోతం బయటపెడతానని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలు ఇప్పుడు పొలిటికల్ సర్కిళ్లలో సంచలనంగా మారాయి. ఇంతకు రాజా సింగ్‌ని సస్పెండ్ చేస్తారనే ప్రచారం ఎందుకు జరుగుతుందంటే.. కొంతకాలంగా ఆయన చేస్తోన్న వ్యాఖ్యలే దీనికి కారణం అంటున్నారు విశ్లేషకులు. కొన్ని రోజుల క్రితం రాజా సింగ్.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలకు మద్దతిచ్చేలా వ్యాఖ్యానించారు. కవిత లిక్కర్ స్కామ్‌లో తీహార్ జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా బీజేపీలో విలీనం చేసి.. రాబోయే ఎన్నికల్లో.. బీఆర్ఎస్ మాత్రమే పార్టీ టికెట్లు కేటాయించే స్థాయికి చేరుకుంటుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే రాజా సింగ్ చేసిన వ్యాఖ్యల వల్ల పార్టీకి నష్టం చేకూరుతుందని.. బీజేపీ అగ్ర నాయకులు భావిస్తున్నారట. రాజా సింగ్ చేసిన పని క్రమశిక్షణ ఉల్లంఘన కిందకు వస్తుందని.. అందుకే ఆయనకునోటీసులు ఇచ్చేందుకు రంగం సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతుంది. గతంలో కూడా ఆయన అనేక సందర్భాల్లో పార్టీ అభిప్రాయానికి వ్యతిరేకంగా మాట్లాడారని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. వీటన్నింటిని పరిగణించిన తర్వాత.. బీజేపీ అధిష్టానం రాజా సింగ్‌కు క్రమశిక్షణ ఉల్లంఘన కింద నోటీసులు ఇచ్చేందుకు రెడీగా ఉందంటూ జోరుగా ప్రచారం సాగుతోంది.

# మాంసం వినియోగంలో తెలంగాణ టాప్..

తెలంగాణలో పండగ ఏదైనా.. చాలా మందికి నాన్ వెజ్ లేకుండా సంబరం పూర్తి కాదు. అందుకే తెలంగాణలో మాంసం వినియోగం చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ విషయం మరోసారి రుజువైంది. సర్వే వివరాల ప్రకారం.. మాంసాహార వినియోగం పరిమాణంలో తెలంగాణ దేశంలోనే టాప్ ప్లేస్‌లో నిలిచింది. ప్రతి వ్యక్తి నెలకు సగటున 2 కేజీల మాంసాన్ని లాగించేస్తున్నట్లు నివేదిక వెల్లడించింది. తెలంగాణలో మాంసం కేవలం ఆహారం కాదు.. అది ఒక సంప్రదాయం. పండగల రోజున ఇల్లంతా పసందైన మాంసం కూరల వాసన గుబాళించా ల్సిందే. వేడి వేడి మాంసం వంటకాలతో 'పండగ చేసుకో వడం' తెలంగాణ సంప్రదాయంలో అంతర్భాగం. పండగల సమయంలోనే కాకుండా వీకెండ్ డేస్‌లోనూ మాంసాన్ని ఇష్టంగా తింటుంటారు. అందుకే ఇక్కడ మాంసం వినియో గం రికార్డు స్థాయిలో ఉంటుంది. నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సర్వే ప్రకారం.. దేశంలో మాంసాహార వినియోగం పరిమాణం పరంగా తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణలో సగటున ఒక్కొక్కరు నెలకు 2 కిలోల మాంసం (సంవత్సరానికి దాదాపు 24 కిలోలు) తింటున్నట్టు ఈ సర్వే వెల్లడించింది. ఇది జాతీయ సగటు (నెలకు 0.6 కిలోలు లేదా సంవత్సరా నికి 7 కిలోలు) కంటే మూడు రెట్లు అధికం అని నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# మిస్ వరల్డ్ పోటీదారులకు 30 తులాల బంగారం..



హైదరాబాద్: హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ 2025 పోటీలపై రాజకీయ దుమారం రేగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు పోటీల నిర్వహణపై సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం పంచిందని ఆరోపించగా, మంత్రి జూపల్లి కృష్ణారావు వాటిని ఖండించారు. హరీష్ రావు ఆరోపణలకు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ప్రభుత్వం కేవలం 31 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసిందని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మిస్ వరల్డ్ 2025 పోటీలు సజావుగా ముగిశాయి. మే 31, హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా నిర్వహించిన ఫైనల్ పోటీల్లో.. థాయిలాండ్‌కు చెందిన ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ విజయం సాధించింది. మిస్ వరల్డ్ 2025 కిరీటం దక్కించుకుంది. మిస్ ఇథియోపియా రన్నరప్‌గా నిలిచింది. అయితే పోటీలు ముగిసిన తర్వాత.. దీనిపై రాజకీయ విమర్శలు మొదలయ్యాయి. దీనిలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మిస్ వరల్డ్ పోటీల నిర్వహణపై సంచనలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ సర్కార్ మిస్ వరల్డ్ పోటీలకు భారీగా ఖర్చు చేసిందని.. పైగా కంటెస్టెంట్లకు ఒక్కొక్కరికి 30 తులాల బంగారం ఇచ్చిందని ఆరోపించారు. ఈ క్రమంలో తెలంగాణ పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ఆరోపణలపై స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. మిస్ వరల్డ్ పోటీలను హైదరాబాద్ లో నిర్వహించడం వల్ల.. తెలంగాణ గొప్పతనం ప్రపంచానికి తెలిసిందన్నారు. తమ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలను నిర్వహించిం దని తెలిపారు. అయితే కొందరు కావాలనే మిస్ వరల్డ్ పోటీలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావు చేసే ఆరోపణలకు సాక్ష్యాలు ఉన్నాయా.. ఉంటే నిరూపించండి అని డిమాండ్ చేశారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం ఇచ్చామం టూ హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని..30 తులాలు కాదు కదా కనీసం 3 గ్రాములు కూడా ఇవ్వలేదని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. మిస్ వరల్డ్ పోటీలకు హాజరైన అతిథులు.. తెలంగాణ సర్కార్ చేసిన ఏర్పాట్లపై ఎంతో ఆనందం వ్యక్తం చేశారని మంత్రి జూపల్లి చెప్పుకొచ్చారు. కానీ కొందరు మాత్రం కంటెస్టెంట్ల కాళ్లు కడిగించారని.. సొంత పత్రికల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఐఏఎస్ అధికారులతో కాళ్లు మొక్కించుకున్న ఘనత కేసీఆర్‌దేనంటూ జూపల్లి ఎద్దేశా చేశారు.

మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించేందుకు ఎన్నో దేశాలు,రాష్ట్రాలు పోటీపడ్డాయని మంత్రి జూపల్లి చెప్పుకొచ్చారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఆ అవకాశాన్ని దక్కించుకుందని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ ద్వారా.. తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసేందుకు మంచి అవకాశం లభించిందన్నారు. మిస్ వరల్డ్ పోటీలనిర్వహణ ద్వారా చేనేత కళాకారుల ఉత్పత్తులకు మంచి ప్రచారంలభించిందని మంత్రిజూపల్లిచెప్పుకొచ్చారు.

అంతేకాక మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ కోసం తమ ప్రభుత్వం కేవలం 31 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసిందని.. అయితే స్పాన్సర్ల ద్వారానే దీనిలో 21 కోట్ల రూపాయలు వచ్చాయని తెలిపారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు 30 తులాల బంగారం కాదు కదా.. కనీసం 3 గ్రాములు కూడా ఇవ్వలేదని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు.

# ఔటర్ రింగు రోడ్డు వెలుపల ఉన్న గ్రామాలకూ సేవలు..

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సేవలు అందిస్తున్న జలమండలి తన పరిధిని విస్తరించడానికి సన్నాహాలు చేస్తోంది. ప్రస్తుతం ఔటర్ రింగ్‌రోడ్డు లోపలి ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్న జలమండలి.. ఇకపై వెలుపల ఉన్న ప్రాంతాలకూ నీటిని అందించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. దీనిపై అధికారులు ఇప్పటికే ప్రాథమిక ప్రణాళికను సిద్ధం చేశారు. హైదరాబాద్ రీజినల్ రింగ్‌రోడ్డు లోపల అభివృద్ధికి మార్గం సుగమం అవుతున్న నేపథ్యంలో జలమండలి పరిధిని విస్తరించడం ద్వారా భవిష్యత్ తాగునీటి అవసరాలను తీర్చవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న శంషాబాద్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, నార్సింగి, తుక్కుగూడ, పెద్దఅంబర్‌పేట, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తెల్లాపూర్, తూంకుంట, అమీన్‌పూర్ మున్సిపాలిటీలు ఓఆర్ఆర్‌కు అటూఇటూ విస్తరించి ఉన్నాయి. వీటి పరిధిలోని కొన్ని గ్రామాలు ఔటర్ రింగు రోడ్డు వెలుపలా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భారీగా రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జరుగుతుండటంతో.. తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ మేరకు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఇటీవల విస్తరణ ప్రణాళికపై అధికారులతో సమీక్షించారు.

గోదావరి 2,3 దశల ప్రాజెక్టుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. రూ. 7360 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలు హైదరాబాద్ నగరానికి సరఫరా కానున్నాయి. ఇందులో 15 టీఎంసీలను నేరుగా తాగునీటి అవసరాలకు వినియోగిస్తారు. రెండేళ్లలో ఈ జలాలు అందుబాటులోకి రానుండటంతో.. దీనికి అనుగుణంగా కొత్త ప్రాంతాలకు నీటిని అందించేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జల మండలి 13.72 లక్షల కనెక్షన్లు కలిగి ఉంది. 1.30 కోట్ల జనాభాకు 550 ఎంజీడీల ( మిలియన్ గ్యాలన్స్ పర్ డే) నీటిని ప్రతి రోజూ సరఫరా చేస్తుంది. జలమండలి విస్తరణతో హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన తాగునీటి సేవలు అందుబాటులోకి



వస్తాయని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల ప్రజలు బోర్లు, ప్రైవేటు వాహనాల ద్వారా నీటికి కొనుక్కొని తాగుతున్నారు. జల మండలి విస్తరణతో ఎలాంటి తాగునీటి ఇబ్బందులు ఉండవని అధికారులు అంటున్నారు.

# గౌరవప్రదమైన పోలీస్ ఉద్యోగం చేస్తూ ఇదేం పని..!

తెలంగాణ: ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నా.. అక్రమ దందా ఆగడం లేదు. తాజాగా హైదరాబాద్ కూకట్‌పల్లిలో రూ.2 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకోగా.. ఆరుగురు ముఠా సభ్యులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో తిరుపతికి చెంది న కానిస్టేబుల్ గుణశేఖర్ ఉండటం సంచలనంగా మారింది. వీరు బాపట్ల జిల్లా అద్దంకి నుంచి డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారు.

గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాపై తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. దీనికోసం ప్రత్యేకంగా పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేసి నిఘా పెంచింది. పోలీసులు నిరంతరం దాడులు చేస్తూ.. అక్రమంగా గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసేవారిని పట్టుకుంటున్నారు. అయినా రాష్ట్రంలోకి డ్రగ్స్, గంజాయి చాప కింద నీరులా ప్రవహిస్తూనే ఉంది. గత కొన్ని నెలలుగా పోలీసులు పెద్ద ఎత్తున గంజాయి, డ్రగ్స్ స్వాధీనం చేసుకుంటున్నారు. పట్టుబడిన వారిలో స్థానిక డీలర్లతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా చేసేవారు కూడా ఉన్నారు. రవాణాదారులు తమ పద్ధతులను మార్చుకుంటూ, కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ముఖ్యంగా ఏపీ, ఒడిశా సరిహద్దుల నుంచి గంజాయి అక్రమ రవాణా ఎక్కువగా జరుగుతోంది. విద్యాసంస్థలు, యువతను లక్ష్యంగా చేసుకుని ఈ దందా సాగుతోంది.

హైదరాబాద్ కూకట్‌పల్లిలో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. సుమారు రూ.2 కోట్ల విలువైన డ్రగ్స్‌ను తరలిస్తుండగా సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు ఆరుగురు ముఠా సభ్యులను అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి చెందిన ఒక కానిస్టేబుల్ ఉండటం సంచలనంగా మారింది. వీరు బాపట్ల జిల్లా అద్దంకి నుంచి కూకట్‌పల్లికి ఈ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులకు పట్టుబడిన వారిలో తిరుపతికి చెందిన కానిస్టేబుల్ గుణశేఖర్, తిరుపతి రూరల్‌కు చెందిన ఉన్నం సురేంద్ర, బాపట్ల జిల్లాకు చెందిన దొంతి రెడ్డి హరిబాబు రెడ్డి , అద్దంకి మండలానికి చెందిన చెగుడు మెర్సీ మార్గరెట్, షేక్ మస్తాన్ వలీ , దేవరాజు యేసుబాబు ఉన్నారు. కానిస్టేబుల్ గుణశేఖర్ వద్ద నుంచి 840 గ్రాముల కొకైన్, ఇతర డ్రగ్స్, నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఓటీ అధికారులు తెలిపారు. వీరంతా గత కొద్ది రోజులుగా డ్రగ్స్ దందా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డ్రగ్స్ ముఠాకు సంబంధించిన పూర్తి వివరాలు, వారి నెట్‌వర్క్‌ను తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. అయితే సమాజంలో గౌరవ ప్రదమైన పోలీస్ ఉద్యోగంలో ఉన్న గుణశేఖర్ ఇలాంటి పని చేయటంపై పోలీసు వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. డ్రగ్స్ కేసులో పోలీసు ఉద్యోగంలో ఉన్న వ్యక్తి పట్టుబడటం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణా ఏ స్థాయిలో జరుగుతుందో మరోసారి రుజువు చేస్తోంది.

# హెచ్ఎండీఏ లేఅవుట్లలో ప్లాట్ల వేలం..

తెలంగాణ: హెచ్ఎండీఏ గతంలో చాలా ప్రాంతాల్లో లేఅవుట్‌లు అభివృద్ధి చేసి ప్లాట్లు విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ ప్లాట్లు స్పష్టమైన టైటిల్స్, మంచి లేఅవుట్, మౌలిక సదుపాయాలతో లభిస్తుండటంతో కొనుగోలుదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. తాజాగా.. మరోసారి హెచ్ఎండీఏ ప్లాట్ల వేలానికి అధికారులు సిద్ధమయ్యారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఇప్పటికే లేఅవుట్లలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లను వేలం వేయనున్నారు. హైదరాబాద్ మహానగరం చుట్టూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్ల విక్రయానికి రంగం సిద్ధమైంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ ప్లాట్ల విక్రయ ప్రక్రియను ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ ఔటర్ రింగ్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇమ్ముల్‌నర్వ, ప్రతాప్‌సింగారం, తొర్రూరు, లేమూరు ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా రైతుల నుంచి భూములను సేకరించి హెచ్ఎండీఏ లేఅవుట్‌లను అభివృద్ధి చేసింది. ఈ ప్రాంతాల్లో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించింది.



**అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్లాట్లు..**

హెచ్ఎండీఏ 60-40 నిష్పత్తిలో భూములను అభివృద్ధి చేసి 60 శాతం ప్లాట్లను భూములు ఇచ్చిన రైతులకు కేటాయించింది. మిగిలిన 40 శాతం ప్లాట్లు హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్నాయి. వీటిని ప్రస్తుతం అమ్మకానికి పెట్టేందుకు సిద్ధమయ్యారు. లేమూరులో 83 ఎకరాల్లో అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో మొత్తం 497 ప్లాట్లు ఉండగా.. 333 ప్లాట్లు రైతులకు కేటాయించారు. మిగిలిన 164 ప్లాట్లను హెచ్ఎండీఏ విక్రయించనుంది.

ప్రతాప్‌సింగారంలో 165 ఎకరాల్లో విస్తరించి ఉన్న లేఅవుట్‌లో మొత్తం 1093 ప్లాట్లు అభివృద్ధి చేశారు. రైతులకు కేటాయించినవి పోగా.. 793 ప్లాట్లు హెచ్ఎండీఏ ఆధీనంలో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. తొర్రూరులో 117 ఎకరాల్లో అతిపెద్ద లేఅవుట్‌గా అభివృద్ధి చేయగా.. ఇందులో 985 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని అమ్ముడుపోగా.. ప్రస్తుతం 493 ప్లాట్లు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ ప్లాట్లకు గజానికి కనీస ధర రూ.20-30 వేలపైనే ఉండవచ్చని అంచనా. అత్యధిక ధర కోట్ చేసిన వారికి ప్లాట్లను వేలం ద్వారా విక్రయించనున్నారు.

ప్రస్తుతం స్థిరాస్తి రంగంలో కొంత స్తబ్దత నెలకొన్నప్పటికీ.. హైదరాబాద్ మార్కెట్‌కు పెద్దగా ఇబ్బంది ఉండదని రియల్ ఎస్టేట్ నిపుణులు, అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో మాదిరిగానే ఈ ప్లాట్లకు మంచి స్పందన లభిస్తుందని ఆశిస్తున్నారు. ప్లాట్ల విక్రయం ద్వారా వచ్చే నిధులను నగర అభివృద్ధి పనులకు మళ్లించాలని హెచ్ఎండీఏ యోచిస్తోంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వేలం ప్రక్రియ ప్రారంభమవుతుంది.



# కోర్టు చెప్పినా డోంట్ కేర్..

'థగ్ లైఫ్' చిత్రం విడుదల వేళ.. తమిళ భాష నుండి కన్నడ పుట్టిందన్న కమల్ హాసన్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు తీవ్రంగా స్పందించాయి. సారీ చెప్పాలని, లేదంటే ఆయన సినిమాని బ్యాన్ చేస్తామని కర్ణాటక ఫిలిం ఛాంబర్ హెచ్చరించింది. అయితే క్షమాపణ చెప్పేందుకు నిరాకరించిన కమల్.. అపార్థాలకు క్షమాపణలు ఉండవని తేల్చి చెప్పారు. కర్ణాటక హైకోర్టు తన కామెంట్స్ పై ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో.. కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్‌కు కమల్ ఓ లేఖ రాశారు. సీనియర్ నటుడు కమల్ హాసన్ నటించిన లేటెస్ట్ మూవీ 'థగ్ లైఫ్'. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మరో రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. జూన్ 5న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే ఇప్పుడు కన్నడ వివాదం కారణంగా కర్ణాటకలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయకూడదని కమల్ హాసన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'థగ్ లైఫ్' ఈవెంట్ లో తమిళ భాష నుంచి కన్నడ పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను కన్నడ సంఘాలు, అధికార విపక్ష పార్టీలతో పాటు కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా తీవ్రంగా స్పందించాయి. ఈ క్రమంలోనే కమల్ సినిమాని కర్ణాటకలో బ్యాన్ చేస్తామని కేఫ్‌సీసీ హెచ్చరించింది. దీనిపై కమల్ హాసన్ కర్ణాటక హైకోర్టుని ఆశ్రయించారు. మంగళవారం ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. కమల్ పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక్క క్షమాపణ చెబితే అన్నీ పరిష్కారమయ్యేవని వ్యాఖ్యానించింది. ఈ పరిణామాల నేపథ్యంలో 'థగ్ లైఫ్' చిత్రాన్ని కర్ణాటకలో రిలీజ్ చేయనని కమల్ ప్రకటించారు.

"ప్రస్తుతానికి కర్ణాటకలో 'థగ్ లైఫ్' సినిమాను విడుదల చేయడం లేదు. తప్పులకు మాత్రమే క్షమాపణలు చెబుతారు, అపార్థాలకు కాదు" అని కమల్ హాసన్ కీలక వ్యాఖ్యలు చేసారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా సినిమా రిలీజ్ అయ్యేలా చూడాలంటూ కోర్టులో వేసిన పిటిషన్ ను కూడా కమల్ ఉపసంహరించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. తదుపరి విచారణను హైకోర్ట్ జూన్ 10కి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. మరోవైపు కమల్ హాసన్ తాజాగా కర్ణాటక ఫిలిం ఛాంబర్ కు లేఖ రాశారు. కన్నడ భాషపై తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని, తన ప్రకటన కారణంగా శివ రాజ్ కుమార్ కుటుంబం ఇబ్బంది కలిగించిందని పేర్కొన్నారు.

"కర్ణాటక ప్రజల పట్ల ఉన్న అపారమైన గౌరవంతో, నేను నిజాయితీగా ఈ లేఖ రాస్తున్నాను. 'థగ్ లైఫ్' ఆడియో లాంచ్ సందర్భంగా నేను చేసిన ప్రకటన కారణంగా డాక్టర్ రాజ్ కుమార్ ఫ్యామిలీని, ముఖ్యంగా శివ రాజ్ కుమార్ ని తప్పుగా అర్థం చేసుకోవడం నాకు బాధ కలిగించింది. మనమందరం ఒకే కుటుంబానికి చెందిన వారమని చెప్పాలనే అలా అన్నానే తప్ప, కన్నడ భాషను ఏ విధంగానూ తక్కువ చేయాలనేది నా మాటల ఉద్దేశ్యం కాదు. కన్నడ భాష యొక్క గొప్ప వారసత్వంపై ఎటువంటి వివాదం లేదు.. చర్చా లేదు" అని కమల్ హాసన్ రాసుకొచ్చారు.



# ది రాజా సాబ్ రిలీజ్ డేట్ ఫిక్స్..

ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లో వస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ది రాజాసాబ్' నుంచి మాస్ అప్‌డేట్ వచ్చేసింది. జూన్ 16 ఉదయం 10:52 గంటలకు టీజర్ రిలీజ్ చేస్తామని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ప్రభాస్ ఈ అప్‌డేట్‌ను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ అభిమానులను ఖుషీ చేశాడు. అలాగే వరల్డ్‌వైడ్‌గా ఈ మూవీని డిసెంబర్ 5న విడుదల చేస్తామని కూడా ప్రకటించారు. ఓ భారీ పోస్టర్‌తో పాటు విడుదల తేదీ వెల్లడించడంతో ఫ్యాన్స్ ఫుల్ జోష్‌లో ఉన్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మారుతి కాంబోలో తెరకెక్కుతోన్న 'ది రాజా సాబ్' మూవీకి సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ప్రభాస్ కెరీర్లోనే తొలిసారి రొమాంటిక్ హారర్ జోనర్లో వస్తోన్న ఈ మూవీపై భారీ అంచనాలున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ మూవీలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న రెబల్ ఫ్యాన్స్‌కి కరువు తీర్చేశారు మేకర్స్. 'ది రాజా సాబ్'కి సంబంధించి టీజర్ అప్‌డేట్‌తో పాటు రిలీజ్ డేట్‌ని అఫిషియల్‌గా అనౌన్స్ చేశారు. ఈ మేరకు పోస్టర్‌ని రిలీజ్ చేశారు. 'ది రాజా సాబ్' మూవీ టీజర్‌ని జూన్ 16వ తేదీ ఉదయం 10 గంటల 52 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. అలాగే రిలీజ్ డేట్‌ని కూడా ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ అప్‌డేట్‌లో ప్రభాస్ ఫ్యాన్స్ పండగ చేసుకుంటున్నారు. తెలుగు సినీ ఇండస్ట్రీలో డిసెంబర్ ఐదో తేదీకి ఓ ప్రత్యేకత ఉంది. అల్లు అర్జున్ , సుకుమార్ కాంబినేషన్లో వచ్చిన 'పుష్ప 2' 2024, డిసెంబర్ 5న విడుదలై ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే.

# సీఎం చంద్రబాబుకి ఆహ్వానం



టాలీవుడ్ హీరో అక్కినేని అఖిల్ త్వరలో పెళ్లి పీటలెక్కనున్నాడు. ఈ నేపథ్యంలో ఆయన తండ్రి నాగార్జున మంగళవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని కలసి పెళ్లి ఆహ్వాన పత్రిక అందజేశారు. పారిశ్రామికవేత్త జుల్ఫీ రవ్‌డ్జీ కుమార్తె జైనబ్‌ని అఖిల్ ఈ నెల 6న వివాహం చేసుకోనున్నాడు. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో వివాహ వేడుక జరగనుండగా, రిసెప్షన్ రాజస్థాన్‌లో గ్రాండ్‌గా ప్లాన్ చేశారు. ఇప్పటికే పలువురు సినీ, రాజకీయ ప్రముఖులకు ఆహ్వానాలు పంపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో టాలీవుడ్ అగ్ర హీరో అక్కినేని నాగార్జున మంగళవారం భేటీ అయ్యారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన నాగార్జున చంద్రబాబును కలిశారు. తన చిన్న కుమారుడు అఖిల్ వివాహ ఆహ్వాన పత్రికను అందజేసి పెళ్లికి తప్పకుండా రావాలని ఆహ్వానించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అయిన జుల్ఫీ రవ్‌డ్జీ కుమార్తె జైనబ్‌తో అఖిల్ నిశ్చితార్థం గతేడాది నవంబర్ 26న జరిగిన సంగతి తెలిసిందే. వీరిద్దరు కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఈ జంట వివాహం ఈ నెల ఆరో తేదీన జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే నాగార్జున దంపతులు తమ కుమారుడి వివాహానికి ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. పెళ్లి అన్నపూర్ణ స్టుడియోలో జరగనుండగా.. రిసెప్షన్ రాజస్థాన్‌లో గ్రాండ్‌గా ప్లాన్ చేశారట. అక్కినేని నాగార్జున పెద్ద కుమారుడైన నాగచైతన్యకి హీరోయిన్ శోభితతో వివాహం జరగ్గా... ఇప్పుడు చిన్న కుమారుడు అఖిల్ పెళ్లికి సిద్ధమయ్యాడు. ఈ వివాహానికి సినీ ఇండస్ట్రీలకు చెందిన సెలబ్రెటీలతో పాటు రాజకీయ, క్రీడా, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయి. అఖిల్‌కి గతంలో వ్యాపార దిగ్గజం జీవీ కృష్ణారెడ్డి మనవరాలు శ్రేయా భూపాల్‌తో నిశ్చితార్థం జరగ్గా.. మనస్పర్థల కారణంగా క్యాన్సిల్ చేసుకున్నారు. కొన్నాళ్లుగా జైనబ్‌తో ప్రేమాయణం నడుపుతున్న అఖిల్ ఇప్పుడు ఆమెతో పెళ్లి పీటలెక్కుతున్నాడు. అయితే అఖిల్ కంటే జైనబ్ వయసు తొమ్మిదేళ్లు ఎక్కువని తెలుస్తోంది.

# యంగ్ హీరోతో లవ్ స్టోరీ




'హిట్ 3'తో ఇటీవలే మంచి హిట్టు కొట్టి ఊపుమీదున్నాడు శైలేష్ కొలను. సినిమా అంతా రక్తపాతంతో నింపేశాడని విమర్శలు వచ్చినా 'హిట్ 3' బాక్సాఫీస్ వద్ద బాగానే వసూళ్లు రాబట్టింది. వరుసగా యాక్షన్ థ్రిల్లర్లు, ఇన్వెస్టిగేషన్ డ్రామాలు తీయడంతో విసుగెత్తిన శైలేష్ ఈసారి జోనర్ మారుస్తానని.. వెంకటేష్‌తో కామెడీ ఎంటర్‌టైనర్ తీస్తానని ఓ ఇంటర్వ్యూలో చెప్పిన సంగతి తెలిసిందే. శైలేష్ తాజాగా ఓ యంగ్ హీరోతో సినిమా చేస్తున్నట్లు తెలుస్తోంది. సీనియర్ హీరో శ్రీకాంత్ వారసుడిగా... దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో వచ్చిన 'పెళ్లిసందతో హీరోగా పరిచయమయ్యాడు మేక రోషన్. ఆ సినిమా తర్వాత కాస్త విరామం తీసుకున్న రోషన్ ఇప్పుడు వరుసగా సినిమాలు లైన్లో పెడుతున్నాడు.

ప్రస్తుతం మలయాళంలో స్టార్ హీరో మోహన్‌లాల్ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోన్న రోషన్.. తెలుగులోనూ ఓ ప్రాజెక్ట్ చేస్తున్నాడు. ప్రముఖ నిర్మాత అశ్వనీదత్, ఆయన కుమార్తె స్వప్న దత్ సంయుక్త నిర్మాణంలో 'ఛాంపియన్' అనే సినిమా చేస్తున్నాడు. తాజాగా ప్రముఖ అగ్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లో ఓ మూవీ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రేమకథగా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని శైలేష్ కొలను డైరెక్ట్ చేయనున్నాడట. ఈ ప్రాజెక్ట్పై త్వరలోనే అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది.

శైలేష్ డైరెక్షన్లో వచ్చిన చిత్రాల్లో హింస ఎంత ఎక్కువగా ఉంటుందో అందరికీ తెలిసిందే. అలాగే హీరో హీరోయిన్ల మధ్య ప్రేమ సన్నివేశాలు కూడా అంతే రొమాంటిక్‌గా తీస్తాడు ఈ డైరెక్టర్. 'హిట్ 3'లో హింసాత్మక సన్నివేశాలు శ్రుతిమించినా.. హీరో నాని, హీరోయిన్ శ్రీనిధి శెట్టి మధ్య రొమాంటిక్ సన్నివేశాలు కూడా అంతే స్థాయిలో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు రోషన్‌తో తెరకెక్కే ప్రేమకథని కూడా అదే రేంజులో తీయనున్నాడని టాక్. ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. రోషన్ నటిస్తోన్న 'ఛాంపియన్' చిత్రం స్పోర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కుతోం ది. ప్రస్తుతం 70 శాతం షూటింగ్ పూర్తికాగా.. మిగతా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రోషన్, శ్రీలీల ఒకేసారి తెలుగు తెరకు పరిచయం కాగా.. శ్రీలీల మాత్రం జెట్ స్పీడుతో దూసుకుపోతోంది. మరోవైపు ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉన్న రోషన్ ఇప్పుడు స్పీడ్ పెంచాడు.

# 'ఓజీ' రైట్స్‌కి కళ్లుచెదిరే ధర!



పవన్ కళ్యాణ్, సుజీత్ కాంబినేషన్‌లో వస్తోన్న 'ఓజీ' మూవీపై అంచనాలు భారీగా ఉన్నాయి. సెప్టెంబర్ 25న దసరా కానుకగా రిలీజ్ కానున్న ఈ చిత్రం నైజాంలో థియేట్రికల్ రైట్స్ ఏకంగా రూ.90 కోట్లు దాటనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమైతే పవన్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ రికార్డ్ అవుతుంది. రూ.250 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో బాలీవుడ్ విలన్ ఇమ్రాన్ హష్మీ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం పవన్ చేతిలో 'హరిహర వీరమల్లు', 'ఓజీ', 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాలు ఉండటంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు.

రన్ రాజా రన్, సాహో చిత్రాలతో ఇండస్ట్రీని ఆకర్షించిన సుజీత్ డైరెక్షన్లో పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఓజీ'. పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తీస్తోన్న ఈ మూవీని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య దీన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీకి సంబంధించి పవన్ ఫస్ట్ లుక్, టైటిల్ టీజర్‌కు అదిరిపోయే రెస్పాన్స్ రావడంతో అంచనాలు తారాస్థాయికి చేరాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోన్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా సెప్టెంబర్ 25న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇటీవలే అధికారికంగా ప్రకటించారు.

ఈ చిత్రంపై నెలకొన్న అంచనాలతో థియేట్రికల్ బిజినెస్ అద్భుతంగా జరుగుతోందట. సినీ పరిశ్రమకు కీలకమైన నైజాంలో ఓజీ హక్కుల కోసం భారీ పోటీ నెలకొందట. ఇక్కడ ఏకంగా రూ.90 కోట్ల వరకు బిజినెస్ జరుగుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇది నిజమో కాదో తెలియదు గాని నిజమైతే మాత్రం నైజాంలో బిగ్గెస్ట్ రికార్డ్ అనే చెప్పాలి. ఇంత మొత్తంలో ధర ఇచ్చేందుకైనా అగ్ర నిర్మాతలు ఉత్సాహంగా ఉన్నారట. 'ఓజీ'లో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తుండగా, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, ప్రకాశ్ రాజ్, హరీశ్ ఉత్తమన్, అభిమన్యు సింగ్, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'ఓజీ' బడ్జెట్ రూ.250 కోట్లు కాగా.. పవన్ రెమ్యునరేషన్‌కే రూ.100 కోట్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

పవన్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా ఈ నెల 12న రిలీజ్ కానుంది.'ఓజీ' మూవీ దసరా కానుకగా సెప్టెంబర్ 25న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అఫిషియల్‌గా ప్రకటించారు. మరోవైపు హరీష్ శంకర్ డైరెక్షన్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ జూన్ రెండో వారం నుంచి షూటింగ్ ప్రారంభం కానున్నట్లు నిర్మాతలు తెలిపారు. రాజకీయాలతో బిజీగా ఉన్నప్పటికీ మూడు సినిమాలు లైన్లో పెట్టడం పవన్ కళ్యాణ్ కెరీర్లో ఇదే తొలిసారి కావడం విశేషం. నైజాంలో ఇప్పటివరకు రాజమౌళి దర్శకత్వంలో రాంచరణ్, ఎన్టీఆర్ మల్టీస్టారర్‌గా వచ్చిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకి రూ.70 కోట్లు, కల్కి సినిమాకి రూ.65 కోట్ల ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగినట్లు ఇండస్ట్రీ వర్గాల టాక్. ఇప్పుడు 'ఓజీ' వాటిని దాటేసి నంబర్ ప్లేస్‌లోకి నిలవడం విశేషం.



# మీకు అవసరమా...

తెలుగులో మెగాస్టార్ చిరంజీవి సినిమాకు ప్రమోషన్ వీడియో చేయడం వల్ల విమర్శలు ఎదుర్కొంటున్న నయనతార ధీటుగా స్పందించింది. "ప్రమోషన్‌కి వెళ్లాలా? వద్దా? అన్నది నా పర్సనల్ విషయం. దీంట్లో ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు" అంటూ ట్రోలర్లకు బదులిచ్చింది. చిరంజీవి-అనిల్ రావిపూడి సినిమాలో రూ.18 కోట్లు తీసుకుంటోందని టాక్. తమిళ సినిమాల ప్రమోషన్లకు రావని నయన్ తెలుగు సినిమాకి ముందే ప్రమోషన్ చేయడం ఎలా అని కొందరు నెటిజన్లు ప్రశ్నించగా, ఆమె స్వయంగా స్పందించింది.

ప్రస్తుతం లేడీ సూపర్‌స్టార్ నయనతార క్రేజ్ మామూలుగా లేదు. ప్రస్తుతం అరడజనుకు పైగా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఆమె సీనియర్, జూనియర్ హీరోలు అన్న తేడా లేకుండా అందరితోనూ నటిస్తోంది. చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్లో తెరకెక్కుతోన్న మూవీలో నటించేందుకు ఏకంగా రూ.18 కోట్లు తీసుకుంటున్నట్లు టాక్. అయితే నయనతారతో ప్రాజెక్ట్ గురించి చర్చించేందుకు చెన్నై వెళ్లిన అనిల్ రావిపూడితో ఆమెతో ఓకే చేయించి వెంటనే ప్రమోషన్ వీడియో కూడా చేయించేశాడు. కొన్నాళ్లుగా ఏ మూవీ ప్రమోషన్స్‌కి రాని నయనతారని అలా ఒప్పించినందుకు ఆయనపై సినీ ప్రముఖులతో పాటు నెటిజన్లు ప్రశంసలు కురిపించారు.

రూ.100 కోట్లు ఇచ్చినా ఆ హీరోతో నటించను... దఅయితే ఇంతవరకు బాగానే ఉన్నా నయనతారపై కోలీవుడ్ నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. తమిళ సినిమాల ప్రమోషన్లలో ఏనాడూ పాల్గొనని నువ్వు తెలుగు సినిమాకి అదీ షూటింగ్ మొదలు కాకముందే ఎలా ప్రమోషన్ చేస్తావ్.. తెలుగు సినిమాలపై అంత మమకారం ఉంటే టాలీవుడ్‌కే షిఫ్ట్ అయిపో అంటూ నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. అయితే ఈ ట్రోలింగ్‌కి నయనతార ధీటుగా స్పందించింది. అనవసర విషయాలకి టైమ్ వేస్ట్ చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. నా వీలును బట్టి నిర్మాతలకు సహకరిస్తూనే ఉంటా. ప్రమోషన్లకి వెళ్లాలా?.. వద్దా.. అన్నది నా పర్సనల్ విషయం. దీంట్లో ఒకరికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు' అని తనదైన స్టైల్‌లో రిప్లయ్ ఇచ్చింది లేడీ సూపర్‌స్టార్.

నయనతార ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో సుమారు 10 సినిమాల్లో నటిస్తోంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో గతంలో రెండు సినిమాలు చేయగా.. అనిల్ రావిపూడి డైరెక్షన్లో మూడోసారి నటిస్తోంది. మరోవైపు ఆమెకు శరవణన్ హీరోగా తెరకెక్కుతోన్న రెండో సినిమాలో ఆఫర్ వచ్చిందట. ఇందుకోసం ఆమెకు ఎంత పారితోషికమైనా ఇచ్చేందుకు ఆయన టీమ్ సిద్ధమైందట.

అయితే తనకు రూ.100 కోట్లిచ్చినా సరే ఆయనతో నటించనని తెగేసి చెప్పేసిందట. ఇది నిజమో కాదో తెలీదు గాని కోలీవుడ్‌లో మాత్రం వార్త తెగ వైరల్ అవుతోంది. అలాగే తమిళం, కన్నడం, మలయాళ భాషల్లోనూ నయనతార క్రేజ్ మామూలుగా లేదు. ఈ సినిమాలన్నీ ఓవైపు షూటింగ్ కంప్లీట్ చేసుకుంటుండగానే కొత్త ప్రాజెక్టులను లైన్లో పెడుతోంది. మొత్తానికి సినిమాలతోనే కాదు తనపై విమర్శలు చేసే ట్రోలర్స్‌కి ధీటైన సమాధానంతోనూ నయనతార వార్తల్లో నిలుస్తోంది.

# తీన్మార్ మల్లన్న వివాదాస్పద వ్యాఖ్యలు

"రాజేంద్ర ప్రసాద్ బూతులు తిడుతున్నప్పుడు అలీ అక్కడే ఉండి నవ్వుతున్నాడు. వాడ్ని ఒక తన్ను తన్నాల్సింది. వాడొక సిగ్గులేని వెదవ. నువ్వు అసలు మనిషివేనారా రాజేంద్రప్రసాద్. ఫాల్తు నా కొలికా. నిన్ను ఎవరైనా ఆ మాట అంటే ఊరుకుంటావా? నీ ఫాల్తు మొహంలో చెప్పు. సిగ్గు శరం ఉండాలి. అలీ తల్లిని లంలి అన్నందుకు క్షమాపణలు చెప్పాలి. దొంగ నా కొలికా.. సినిమా వాళ్ళు అనగానే మీరేమన్నా అదవుతారా?. ఏ ఊర్రా నీది?. మా వర్గాల ప్రజల గురించి తప్పుగా మాట్లాడితే ఇట్లే మాట్లాడాల్సి వస్తుంది. నువ్వు మా మైనారిటీ బీసీ వర్గాలకు దొరికితే, నిన్ను తన్నకపోతే అడుగు. వేస్ట్ నా కొలికా" అంటూ తీన్మార్ మల్లన్న షాకింగ్ కామెంట్స్ చేసారు. ( నేను ఇలానే సరదాగా ఉంటా.. తప్పుగా అర్థం చేసుకుంటే మీ కర్మ.. ఆలీ కాంట్రవర్సీపై రాజేంద్ర ప్రసాద్ ) రాజేంద్రప్రసాద్ పై తీన్మార్ మల్లన్న మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడింది తప్పైతే, మల్లన్న మాట్లాడింది ఏంటని కౌంటర్ ఇస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ అంతకంటే తీవ్ర అసభ్యకరమైన కామెంట్స్ చేసారంటూ మల్లన్నను విమర్శిస్తున్నారు. గతంలో పలు సందర్భాల్లో మల్లన్న వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. రాజేంద్రప్రసాద్ ఉద్దేశ్యపూర్వకంగా తనపై కామెంట్స్ చేయలేదని అలీ స్వయంగా క్లారిటీ ఇచ్చారని.. వాళ్ళు వాళ్ళు బాగున్నప్పుడు మధ్యలో నీ బాధ ఏంటి? అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

గతంలో కూడా పలు సందర్భాల్లో రాజేంద్రప్రసాద్ నోరు జారడం, ఆ తర్వాత క్షమాపణ చెప్పడం తెలిసిందే. కానీ ఈసారి విమర్శలు వచ్చినా ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదు. తాను మాట్లాడే మాటలను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని.. అది వాళ్ళ ఖర్మ.. సంస్కారం మీద ఆధార పడి వుంటుందని అంటు న్నారు. తప్పుగా మాట్లాడడం వేరు, తప్పుగా అర్థం చేసుకోవడం వేరు అని నెటిజన్లు కౌంటర్ ఇస్తున్నారు. అలీ మాత్రంపెద్దాయన్ని వదిలేయండి అంటూ వీడియో పోస్ట్ చేసారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,